ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 27.5
కనిష్ఠం 15.4

ANDHRAJYOTHY

నల్లగొండ

5 గురువారం 20 నవంబరు 2025

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	585.50 (298.8775)	నిల్	14,760
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.20 (4.25)	1,031.82	723.02
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.095 (42.886)	1,000	8,000

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.152 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260

మేమింతే!



- ప్రతీ డాక్యుమెంట్‌కు ఓ రేటు
- అక్రమ రిజిస్ట్రేషన్‌లకు అదనపు ముడుపులు
- కొన్ని చోట్ల డాక్యుమెంట్ రైటర్లే షాడో ఎస్‌ఆర్‌వోలు
- ఏసీబీ దాడులు జరుగుతున్న మారని తీరు

స్టాంపులు, రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అవినీతి అక్రమాలకు అడ్డులేదన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. అడపాదడప ఏసీబీ దాడులు జరుపుతున్నా కొందరూ అధికారుల్లో మార్పు రావడం లేదన్న విమర్శలున్నాయి. ఇటీవల మిర్యాలగూడలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన అవినీతి తంతంగం చూస్తుంటే యథేచ్ఛగా అక్రమాల దందా కొనసాగుతుందన్న ఆరోపణలున్నాయి.

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

ఇటీవల ఏసీబీ అధికారుల తనిఖీలో మిర్యాలగూడ సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలకు అంతేలేకుండా పోతుందనేది వెలుగులోకి వచ్చింది. ప్రధానంగా డాక్యుమెంట్ రైటర్లు, వారి అనుచరులు ఆ కార్యాలయంలో రాజ్యమేలుతున్నారనేది బయటపడింది. ఈ విధానం సంవత్సరాల తరబడి సాగుతున్నప్పటికీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వారు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భువనగిరి, బీబీనగర్, చండూరు, చౌటుప్పల్, దేవరకొండ, హుజూర్‌నగర్, కోదాడ, మిర్యాలగూడ, మోత్కూరు, నకిరేకల్, నల్లగొండ, నిడమనూరు, రామన్నపేట, సూర్యాపేట, యాదగిరి గుట్ట సబ్ రిజిస్ట్రార్‌లు ఉన్నాయి. ఇందులో పలు కార్యాలయాల్లో పలు కార్యాలయాలల్లో డాక్యుమెంట్ రైటర్లు ఏకంగా షాడో సబ్ రిజిస్ట్రార్‌లుగా వ్యవహరిస్తూ పనులను చక్కబెట్టుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వాస్తవానికి డాక్యుమెంట్ రైటర్లు కార్యాలయంలోకి వెళ్లకుండా బయటి నుంచే ఆయా కౌంటర్ల ద్వారా డాక్యుమెంట్లు అందించాల్సి ఉన్నప్పటికీ ఏకంగా కార్యాలయంలోని కంప్యూటర్ రూమ్‌లోకి వెళ్లి అనేక పనులు చేసుకోవడంతో పాటు పెత్తనం చెలాయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక కొన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని సీనియర్ డాక్యుమెంట్ రైటర్లు సబ్ రిజిస్ట్రార్‌లను సైతం బ్లాక్‌మెయిల్ చేస్తూ తమ అక్రమ డాక్యుమెంట్లను చక్కబెట్టుకున్నట్లు చర్చ సాగుతోంది. కొందరూ సబ్ రిజిస్ట్రార్‌లు ఏకంగా సీనియర్ డాక్యుమెంట్ రైటర్లు ఏమి చెబితే ఆ పని చేసి పెడుతుండటం గమనార్హం. అదేవిధంగా లేఅవుట్‌లు లేకుండా, ఎల్‌ఆర్‌ఎస్ లేకుండా కూడా కొంతమంది సబ్‌రిజిస్ట్రార్‌లు రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

కొన్నిచోట్ల ఎల్‌ఆర్‌ఎస్ లేకపోతే గజానికి రూ.100 చొప్పున రేటు కట్టి ఆయా ప్లాట్‌లకు రిజిస్ట్రేషన్ చేస్తుండటంతో ప్రభుత్వ ఖజానాకు గండి పడటం ఆయా ఎస్‌ఆర్‌వోలకు అదనపు ఆదాయం సమకూరడం జరుగుతుంది. ఇకపోతే నల్లగొండ జిల్లాలో ఒక సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, సూర్యాపేట జిల్లాలో ఒక సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఒక సబ్ రిజిస్ట్రార్‌లో సీనియర్ అసిస్టెంట్‌లే ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌లుగా వ్యవహరిస్తున్నారు. ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలల్లో ఎప్పుడు పూర్తిస్థాయిలో సబ్ రిజిస్ట్రార్‌లను నియమిస్తారనేది స్పష్టత లేదు.

ఉమ్మడి కార్యాలయంలో..

ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇన్‌చార్జి అధికారులు ఉన్నప్పుడు కొందరూ సబ్ రిజిస్ట్రార్‌లతో డాక్యుమెంట్ రైటర్లు మరింతగా ఆ అవకాశాన్ని తమకు అనుకూలంగా

మిగతా 8వ పేజీలో

ముడుపులు పుచ్చుకుంటూ..

ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒక్కో డాక్యుమెంట్‌కు ఓ రేటు పెట్టగా అక్రమ డాక్యుమెంట్లకు అదనపు ముడుపులు పుచ్చుకుంటూ ఫైళ్లను కదిలిస్తున్నారు. కాసులు ఇస్తే అక్రమ డాక్యుమెంట్లు సైతం సక్రమంగా మారడం, లేదంటే సక్రమంగా ఉన్న డాక్యుమెంట్లను అనేక తిరకాసులు పెట్టి తిప్పడం పరిపాటిగా మారింది. చాలామంది డాక్యుమెంట్ల రైటర్ల ద్వారానే తంతంగం అంతా నడిపిస్తున్నట్లు ఇటీవల మిర్యాలగూడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు గుర్తించారు. వాస్తవానికి ఆస్తుల క్రయ విక్రయదారులు, సాక్ష్యులు మాత్రమే అడుగుపెట్టాల్సి ఉండగా డాక్యుమెంట్ల రైటర్లు కార్యాలయంలో పెత్తనం చేస్తున్నట్లు వినికిడి. ఒక్కో డాక్యుమెంట్‌కు రూ.500 నుంచి రూ.1000 వసూలు చేస్తుండగా ఈసీలకు, సీసీలకు రూ.300 నుంచి రూ.400, మ్యారేజీ సర్టిఫికేట్లకు రూ.1000 నుంచి రూ.1500 వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. డబ్బులు ఇవ్వని డాక్యుమెంట్లను పెండింగ్‌లో పెట్టడం పరిపాటి.

మత్స్యకారుల ఆర్థిక పరిపుష్టికి కృషి

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు



శాలిగౌరారం ప్రాజెక్టులో చేప పిల్లలను వదులుతున్న సామేలు

శాలిగౌరారం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులను అన్ని విధాలుగా ఆదుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. శాలిగౌరారం ప్రాజెక్టులో ఉచిత చేప పిల్లలను వదిలే కార్యక్రమాన్ని బుధవారం ఎమ్మెల్యే మందుల సామేలు ప్రారంభించి మాట్లాడారు. మత్స్యకారుల ఆర్థిక పరిపుష్టి కోసం ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని చెరువులు, ప్రాజెక్టుల్లో ఉచితంగా చేప పిల్లలను పెంచడానికి రూ.80కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. జిల్లా మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రాజారాం మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో 11 వందల చెరువుల్లో 5 కోట్ల 98 లక్షల చేప పిల్లలను పెంచేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. జిల్లాలో అన్ని చెరువుల్లో చేప పిల్లలను పోసే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. శాలిగౌరారం ప్రాజెక్టులో 8 లక్షల చేప పిల్లలను మత్యసంఘం ఆధ్వర్యంలో వదిలినట్లు వెల్లడించారు. మత్స్యకారులు చేపలను బాగా పెంచుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ సహకార సంఘం అధ్యక్షుడు కనుక వెంకటనారాయణ, డైరెక్టర్ చెన్నబోయిన వీరయ్య, జిల్లా మత్స్యశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ వి. శ్రీనివాస్, శాలిగౌరారం మార్కెట్ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నరిగే నర్సింమ, తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో జ్యోతిలక్ష్మి, ఏవో సౌమ్యశృతి, మత్యశాఖ ఫీల్డ్ ఆఫీసర్ ప్రియాంక, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, సాదుల నర్సయ్య, చాడ సురేష్‌రెడ్డి, గంధసిరి వెంకన్న, సైదులు, యాదగిరి, రమేష్,

వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

నల్లగొండ(కలెక్టరేట్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందని జిల్లా రెవెన్యూ అధికారి అశోక్‌రెడ్డి అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో ఈ నెల 12 నుంచి 19 వరకు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చివరి రోజైన బుధవారం జిల్లా స్థాయి సమావేశాన్ని కలెక్టరేట్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో వయోవృద్ధుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామన్నారు. ఆసరా పింఛన్‌తో పాటు మెరుగైన జీవనశైలి కోసం, సౌకర్యాలు కల్పించడం కోసం ప్రభుత్వం అన్నిశాఖల సమన్వయంతో పని చేస్తోందన్నారు. వయోవృద్ధుల కోసం ఉచిత ఆశ్రమం స్థల కేటాయింపు జరిగిందన్నారు. ఈ సందర్భంగా విశిష్ట సేవలు అందించిన వయోవృద్ధులకు సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సముద్రాల మల్లికార్జున్, కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ నాయకులు, అదనపు వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి, మహిళా శిశు, వయోవృద్ధుల శాఖ ఫీల్డ్ ఆఫీసర్ మునగాల నాగిరెడ్డి, శ్రీకాంత్, సునీల్, సిబ్బంది వెంకట్‌రెడ్డి, బాలయ్య, సునీత పాల్గొన్నారు.

సారె, చీర పెట్టడం తెలంగాణ సంప్రదాయం

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

నల్లగొండ(కలెక్టరేట్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆడబిడ్డలకు చీర, సారె పెట్టడం తెలంగాణ సంప్రదాయమని, అందులో భాగంగా ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణారావులతో కలిసి బుధవారం ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరల పంపిణీని ప్రారంభించుకున్నామన్నారు. ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రక్రియకు సంబంధించి ప్రతీ నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని ఆదేశించారు. నియోజకవర్గాల్లోని అన్ని మండల కేంద్రాల్లో విడతల వారీగా ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టాలన్నారు. పండగ వాతావరణంలో ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టాలన్నారు. మహిళల ఉన్నతి- తెలంగాణ ప్రగతి - ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం పేరుతో ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరికీ చీరల పంపిణీ సమాచారాన్ని అందించాలన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాలకు ఇప్పటివరకు రూ.27 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని, ఉచిత బస్సు సౌకర్యం కల్పించడమే కాకుండా మహిళలే బస్సులను నిర్వహించుకునేలా ఇందిరా మహిళా శక్తి పేరుపై మహిళా సంఘాలకు బస్సులు ఏర్పాటు చేశామన్నారు. స్కూల్స్‌లో యూనిఫారం కుట్టే బాధ్యత మహిళా సంఘాలకే అప్పగించామని దీని ద్వారా వారికి రూ.30 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. రూ.554 కోట్ల విలువ చేసే అమ్మ ఆదర్శ పాఠశాల పనులను మహిళా సంఘాలకు అప్పగించామని, మహిళా సంఘాలకు పెట్రోల్ పంపులు, సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేసి వారిని ఆర్థికంగా నిలబెట్టేలా చేశామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరలు అందేలా కలెక్టర్లు పారదర్శకంగా పంపిణీ చేయించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బుధవారం నుంచి డిసెంబరు 9 వరకు ఇందిరమ్మ చీరల పంపిణీ ఉంటుందని, మార్చి 1 నుంచి 8 వరకు పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ చీరల పంపిణీ ఉంటుందన్నారు. వివాదాలకు తావు లేకుండా చీరల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యర్, సెక్రటరీ దేవసేన తదితరులు మాట్లాడారు. వీడియోకాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. జిల్లా నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, ఇతర జిల్లా అధికారులు, జిల్లా సమాఖ్య బాధ్యులు, సహాయక మహిళా సంఘాల అధ్యక్షులు హాజరయ్యారు.



సీఎంతో వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఇతర శాఖల అధికారులు

23న పంచాయతీ ఎన్నికల ఓటర్ల జాబితా పునః ప్రచురణ



నల్లగొండ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వచ్చేనెలలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తుండగా, రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు మొదలు పెట్టింది. ఇందు కోసం బుధవారం ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. నవంబరు 20న కొత్త ఓటర్ల నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తారు. అదేరోజున ప్రచురించిన ఓటర్ల జాబితాలో సవరణలు, ఇతర మార్పులు, చేర్పులను, పోలింగ్ స్టేషన్లు, లొకేషన్ల మార్పులను ఎన్నికల అధికారులు సమోటోగా నిర్వహిస్తారు. 22న ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలు, వినతులను జిల్లా పంచాయతీ అధికారులు పరిష్కరిస్తారు. 23న తుది పునః ప్రచురణకు సిద్ధం చేసిన ఫొటోలతో సహా ఓటర్ల జాబితాలను డీపీవోల వద్ద ప్రదర్శిస్తారు. 23న పోలింగ్ స్టేషన్ల వారీగా మార్పులతో కూడిన ఓటర్ల జబితాలు ప్రదర్శిస్తారు. ఇదిలా ఉండగా సాధారణ పరిశీలకురాలిగా కొర్ర లక్ష్మి, వ్యయ పరిశీలకునిగా వెంకట ఆదిత్య నియమితులయ్యారు.

42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా చైర్మన్ మునాస ప్రసన్నకుమార్

నల్లగొండ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ మునాస ప్రసన్నకుమార్ అన్నారు. బీసీ జేఏసీ జిల్లా కమిటీని బుధవారం నల్లగొండలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్ మునాస ప్రసన్నకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ కమిటీ సభ్యులందరూ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే పోరాటంలో తమవంతు బాధ్యతగా పాల్గొనాలన్నారు. రిజర్వేషన్ల సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా 42శాతం రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధంగా కల్పించిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లాలోని వివిధ కులసంఘాల అధ్యక్షులు, వివిధ బీసీ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు. అంతకు ముందు జిల్లా బీసీ యూత్ జేఏసీ చైర్మన్‌గా కట్టెకోలు దీపేందర్, బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్‌గా అయితగోని జనార్దన్‌గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం బీసీ జేఏసీ కమిటీని జేఏసీ చైర్మన్ మునాసు ప్రసన్నకుమార్ నియమించారు. గౌరవ సలహాదారులుగా చీర పంకజ్‌యాదవ్, గౌరవాధ్యక్షులుగా సుంకరి మల్లేష్‌గౌడ్, గుంటోజు వెంకటాచారి, చిలకరాజు చెన్నయ్య, పర్వతాలు, జిల్లా వర్కింగ్ చైర్మన్‌గా మిర్యాల యాదగిరి, ప్రధానకార్యదర్శిగా గజ్జి అజయ్ కుమార్ యాదవ్, కోఆర్డినేటర్‌గా చెన్నూరి భరద్వాజయాదవ్, సంయుక్త కార్యదర్శులుగా గడగోజు విజయ్, ఆనంతుల నాగరాజ్‌గౌడ్, కన్వీనర్లుగా పాల్వాయి రవి, కర్నాటి యాదగిరి, తలారి యాదగిరి, కోకన్వీనర్లుగా ఏరుకొండ హరి, పగిళ్ళ సైదులు, వైస్ చైర్మన్‌లుగా వడ్డెబోయిన రామకృష్ణ, చిలకరాజు సతీష్, మార్గం సతీష్, పొగాకు నాగరాజు, పట్టణ అధ్యక్షుడిగా పుట్ట వెంకన్నగౌడ్, ఉపాధ్యక్షుడిగా చెన్నోజు రాజు, యూత్ జేఏసీ పట్టణ అధ్యక్షుడిగా మల్లెబోయిన సతీష్‌యాదవ్, మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఖదీర్‌లను నియమించారు.

సీపీఐ బస్సుయాత్ర



7 గట్టుప్పల్‌లో మాట్లాడుతున్న నెల్లికంటి సత్యం

సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర బుధవారం జిల్లాలో కొనసాగింది. ఈ నెల 15న గద్వాల నుంచి ప్రారంభమైన యాత్ర బుధవారం జిల్లాకు చేరింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పాల్గొని నాయకులకు స్వాగతం పలికారు.

నేడు చెర్వుగట్టులో గిరిప్రదక్షిణ

- విస్తృత ప్రచారం చేసిన వీహెచ్‌పీ
- భక్తులు భారీగా పాల్గొనే అవకాశం

నార్కట్‌పల్లి, నవంబరు 19,(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం వద్ద ప్రారంభించిన గిరిప్రదక్షిణ నేడు రెండో పర్యాయం జరగనుంది. ధర్మ ప్రచార సంపర్క్ ప్రముఖ్ ఉంద్యాల ప్రకాష్‌రెడ్డి నేతృత్వంలో గత నెల అమావాస్య రోజున ప్రారంభించిన చెర్వుగట్టు గిరి ప్రదక్షిణ రెండో నెల ఈ నెల 20వ తేదీన కొనసాగనుంది. ఆలయాల ప్రాశస్త్యాన్ని ప్రచారం చేయాలని సంకల్పించి గిరిప్రదక్షిణకు భక్తుల నుంచి మొదటిసారి మంచి స్పందన లభించింది. గుట్ట కింద రాజగోపురం మెట్లమార్గం వద్ద ప్రారంభించి నంది సర్కిల్ ద్వారా నల్లచెర్వు కట్ట నుంచి ఎల్లారెడ్డిగూడెం మీదుగా తిరిగి ఘాట్ రోడ్డు మీదుగా గుట్టపైకి చేరుకొని పార్వతీ జడల రామలింగేశ్వరుని దర్శించుకోవడంతో తొలి పర్యాయం గిరిప్రదక్షిణను పూర్తిచేశారు. విశ్వహిందూ పరిషత్ కూడా గిరి ప్రదక్షిణపై విస్తృత ప్ర చారం నిర్వహిస్తోంది. గిరిప్రదక్షిణకు భక్తులు రావాలని ఇప్పటికే పలు సోషల్ మీడియా ద్వారా ప్రచారం నిర్వహించారు. ఉదయం 6.15 గంటలకు గిరి ప్రదక్షిణ ప్రారంభం కానుంది.

ఆడపిల్లలను కాపాడుకోవాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆడ శిశువుల విక్రయాలు, బాల్యవివాహాలు, బాలికలపై లైంగికదాడులు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ(వీసీపీసీ) బలోపేతంపై కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ముఖ్యంగా గ్రామీణ స్థాయిలో ప్రజలకు అవగాహన లేకపోవడం వల్ల ఆడపిల్లలను అక్రమంగా దత్తత ఇవ్వడం, బాల్య వివాహాలు చేస్తున్నారన్నారు. విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీల సమావేశాలను ఈ నెల 30లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కరపత్రాలు, పోస్టర్లు, పాటలు, కళారూపాల ద్వారా, ప్రత్యేకించి లంబాడా భాషలో తయారు చేయిస్తున్నామన్నారు. గ్రామ స్థాయి చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీల సమావేశాలు నిర్వహించే గ్రామాల్లో మైకుల ద్వారా ప్రచారం చేయించాలన్నారు. ఈ సమావేశంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, సీడీపీవోలు, డీసీపీవో గణేష్, డీసీపీయూ సిబ్బంది తేజ, విద్య, వెంకన్న, రేవతి, నర్సింహ, అంజలి, ఎల్లేశ్వర్ పాల్గొన్నారు.

చదువుతోనే అన్నీ సాధ్యం

చదువుతోనే అన్నీ సాధ్యమవుతాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహిస్తున్న 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆమె జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. అంతకుముందు దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంతో కష్టపడి ఇందిరాగాంధీ ప్రధాని అయ్యారని, పేద ప్రజల సంక్షేమానికి గరీబీ హటావో నినాదాన్ని తీసుకువచ్చారన్నారు. ఆమె అనేక భాషల్లో ప్రావీణ్యురాలని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఎం.హఫీజ్ ఖాన్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందిస్తాయన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ ప్రస్తుత భవనం సరిపోనందున కొత్త భవనం మంజూరు చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ బాలమ్మ, ఉద్యోగులు కుసుమశ్రీ, రవి, మల్లేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు సహకారం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు సహకారం అందిస్తానని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎన్జీ కళాశాలలో ఈ నెల 28 నుంచి డిసెంబరు 12 వరకు కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే ఎన్‌పీఎల్-6 పోస్టర్‌ను మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్‌తో కలిసి మంత్రి బుధవారం సెక్రటేరియట్లో ఆవిష్కరించారు. టోర్నమెంట్‌కు అన్ని విధాలా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ మాట్లాడుతూ టోర్నమెంట్‌లో పాల్గొనే విజేతలకు మొదటి బహుమతి 2,22,222, ద్వితీయ బహుమతిగా 1,11,111 అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు అంగోతు ప్రదీప్‌నాయక్, కేసాని వేణుగోపాల్‌రెడ్డి, నిర్వాహకులు బోనగిరి ప్రభాకర్, ముత్తినేని నాగేశ్వరరావు, పాలకూరి శ్రీధర్, గంజి గిరి, కోమటిరెడ్డి శేఖర్‌రెడ్డి, సాయి, చిన్ని రంగ, మధు, నవీన్‌రెడ్డి, నాని పాల్గొన్నారు.

సంస్కరణల ఘనత ఇందిరాగాంధీదే

నల్లగొండ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశ అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్నో సంస్కరణలు చేపట్టిన ఘనత మాజీ ప్రధాని ఇందిరాగాంధీకే దక్కుతుందని మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ అన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని బుధవారం పట్టణంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఇందిరాగాంధీ ప్రధానిగా బ్యాంకులను జాతీయకరణ చేసి నిరుపేదలకు బ్యాంకులను అందుబాటులోకి తెచ్చారన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, కేసాని వేణుగోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కత్తుల కోటి, జహంగీర్ బాబా, మామిడి కార్తీక్, గాలి నాగరాజు, జానీ, పాదం అనిల్, కంచర్ల ఆనంద్‌రెడ్డి, పెరిక అంజయ్య, బోడ ప్రభాకర్ పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌గౌడ్

రాజేష్ కుటుంబానికి న్యాయం చేయాలి

● ధర్మ సమాజ్‌పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహారాజ్
● ఇందిరమ్మ ఇల్లు, మునిసిపాలిటీలో ఉద్యోగం ఇస్తామని ఆర్డీవో హామీ
● మంత్రి హామీ ఇవ్వాలని డిమాండ్.. కొనసాగుతున్న ఆందోళన


మాట్లాడుతున్న ధర్మసమాజ్ పార్టీ నాయకుడు విశారదన్ మహరాజ్

కోదాడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ చెక్కుల దుర్వినియోగంలో అరెస్టై మృతిచెందిన కర్ల రాజేష్ కుటుంబానికి న్యాయం చేయాలని సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో బుధవారం కూడా ఆందోళన కొనసాగింది. రాజేష్(30) హుజూర్‌నగర్ సబ్‌జైలులో అస్వస్థతకు గురై చికిత్సకోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లగా గాంధీ ఆస్పత్రిలో ఈ నెల 15వ తేదీన మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని ఈనెల 16న కోదాడకు తీసుకువచ్చారు. పోలీసులు కొట్టడంతోనే రాజేష్ మృతిచెందాడని బంధువులు, మంగళవారం డీఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, ఉద్యోగం ఇస్తామని ఆర్డీవో హామీతో బంధువులు వెనుదిరిగారు. తమకు తగిన న్యాయం జరగలేదని రాజేష్ కుటుంబసభ్యులు బుధవారం మళ్లీ ఆందోళన చేపట్టారు. ధర్మసమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ కోదాడకు చేరుకొని రాజేష్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. రాజేష్ కుటుంబానికి కోటి రూపాయల నగదు, ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేంత వరకు అంత్యక్రియలు చేపట్టేది లేదని స్పష్టం చేశారు. దీంతో కోదాడ పట్టణంలోని గాంధీనగర్‌లో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. మధ్యాహ్నం 12గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ఆందోళన కొనసాగిం ది. డిమాండ్లు నెరవేరిస్తేనే ఆందోళనను విరమిస్తామని రాజేష్ బంధువులు, విశారదన్ మహారాజ్ పేర్కొన్నారు. ఆర్డీవో ఆందోళనకారుల వద్దకు చేరుకొని ఆందోళన విరమించాలని కోరారు. రాజేష్ కుటుంబంలో ఒకరికి మునిసిపాలిటీలో ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ రాజేష్ బంధువులు ఆందోళన విరమించలేదు. కలెక్టర్, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి వచ్చి హామీ ఇవ్వాలని, లేనిపక్షంలో ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ శివశంకర్ గాంధీనగర్‌లో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తారు. రాత్రి కూడా ఆందోళన కొనసాగుతూనే ఉంది.

చిత్తుకాగితాలు ఏరుకుంటూ ఇళ్లలో చోరీలు

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 19,(ఆంధ్రజ్యోతి): పనికిరాని వస్తువులు, కాగితాల ఏరివేత పేరుతో ఆరుగురు మహిళలు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని చొల్లేరు గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చొల్లేరు గ్రామానికి బుధవారం జనగాం జిల్లాకేంద్రానికి చెందిన ఆరుగురు మహిళలు ఆటోలో వచ్చి పనికిరాని వస్తువులు, కాగితాల పేరుతో ప్లాస్టిక్ ఖాళీ బస్తాలు చేత పట్టుకొని గ్రామంలో ఆయా కాలనీలో తిరిగారు. తాళాలు వేసిన ఇళ్లలో తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఇళ్లలో ఇత్తడి బిందెలు, నీళ్ల కరెంట్ మోటర్, ఇతర ఇత్తడి సామగ్రిని బస్తాల్లో నింపుకొని ఆటోలో ఎక్కించారు. దీనిని గమనించిన గ్రామస్థులు అనుమానంతో వారి ప్రశ్నించారు. బస్తాల్లో ఏమి ఉన్నాయని నిలదీశారు. బస్తాల్లో చూడగా సుమారు 20ఇత్తడి బిందెలు, ఇతర వస్తువు లు, కరెంట్ మోటర్ కన్పించాయి. వారికి అడ్డుకొని పోలీసులకు అప్పగించారు.

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి

అనంతగిరి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని పాలారం గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన భూక్య నాగరాజు(42) మట్టపల్లి కోటయ్య వద్ద 15సంవత్సరాలుగా వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం నాగరాజు కృష్ణాపురం గ్రామ శివారులోని జీడయ్య పొలంలోని ఎనిమిది ధాన్యం బస్తాలను ట్రాక్టర్‌లో వేసుకొని వస్తున్నాడు. రాత్రి 7గంటల సమయంలో ట్రాక్టర్ లైట్లు పనిచేయకపోవడంతో నాగరాజు తన వద్ద ఉన్న సెల్‌ఫోన్ లైట్ వేసి ఒంటిచేతో డ్రైవింగ్ చేస్తున్న క్రమంలో పాలారం గ్రామ శివారులోని శ్మశానవాటిక వద్ద రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పలు కనబడకపోవడంతో ట్రాక్టర్ ఎడమ టైరు ధాన్యంపైకి ఎక్కి అదుపు తప్పి కాల్వలో పడింది. దీంతో నాగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. జీడయ్యకు కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా నాగరాజు అప్పటికే మృతిచెందాడని డాక్టర్లు తెలిపారు. జీడయ్య చికిత్స పొందుతున్నాడు. నాగరాజు భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

చికిత్సపొందుతూ...

నాగారం: సూర్యాపేట జిల్లా నాగారం బంగ్లా వద్ద జాతీయ రహదారిపై ఈ నెల 15వ తేదీన జరిగిన కారు ప్రమాదంలో కానిస్టేబుల్ కమలాకర్ మృతిచెందిన విషయం విదితమే. అతడితో పాటు తీవ్రంగా గాయపడిన పెరుమాండ్ల ఆశోక్‌రావు(40) హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్సపొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతిచెందారు. కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణమైన కారును, డ్రైవర్‌ను త్వరలోనే పట్టుకుంటామని సీఐ నాగేశ్వరరావు తెలిపారు.

సాగర్ నీటి మట్టం 585.50 అడుగులు

నాగార్జునసాగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు(312.0450 టీఎంసీలు) కాగా బుధవారం సాయంత్రానికి 585.50 అడుగులుగా (298. 8775టీఎంసీలు) నమోదైంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 10వేల క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 4,160 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వా రా 600 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 14,760క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుండగా, ఎగువ నుంచి నీటి రాక లేదు.

బహురూపి బియ్యం వాడితే ఆరోగ్యం

● అంతరిస్తున్న వరి వంగడాలకు ఆయుష్షు పోస్తున్న యువ రైతు ● దేశంలోని వివిధ ప్రాంతాలు తిరిగి విత్తనాల సేకరణ ● కుటుంబం కోసం ఓ రైతు సాగు

పూర్వం రోజుల్లో బలవర్ధక ఆహారాన్ని అందించిన వరి వంగడాలు(బియ్యం) నేడు కను మరుగయ్యాయని, వాటిని తిరిగి వాడుకలోకి తీసుకరావడానికి కృషి చేస్తున్నాడు యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రానికి చెందిన యువ రైతు బిల్లపాటి గోవర్ధన్‌రెడ్డి. అందుకోసం నాలుగేళ్లుగా దేశంలోని వివిధ ప్రాంతాలు తిరిగి విత్తనాలు సేకరిస్తున్నాడు. ఈ ఏడాది 23రకాల వరి వంగడాల విత్తనాలు సేకరించి విత్తన బ్యాంకు కోసం ఒక్కో గుంట విస్తీర్ణంలో వాటిని సాగు చేశాడు. నాలుగేళ్లుగా తాము పండించుకున్న బహురూపి బియ్యం తింటున్నామని, తమ కుటుంబం ఆరోగ్యంగా ఉందని చెప్పాడు.



బహురూపి వరి పొలం

● ఆంధ్రజ్యోతి, మోత్కూరు

పూర్వకాలంలో జన్యు సంక్రమణ లేకుండా పండించిన వివిధ రకాల వరి పంటలు తినడం వల్ల మనుషులు ఆరోగ్యంగా ఉండేవారు. అధిక దిగుబడి కోసం హైబ్రీడ్ విత్తనాలు తయారు చేయడం, వాటిని రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడి పండిస్తుండటంతో వాటి అవశేషాలు బియ్యంలో ఉండి ఆరోగ్యం దెబ్బతిని ఆస్పత్రుల పాలవుతున్నామన్నది జగమెరిగిన సత్యమే అయినా మార్పు కోసం ఎవరూ ప్రయత్నించడం లేదంటున్నాడు. రైతులు వారి కుటుంబానికి అవసరమైనంత పంటనైనా పూర్వ వరి వంగడాలు పండించుకుని తిన్నారు. బహురూపి వరి వంగడంతో పండిచిన బియ్యం తింటే ఆరోగ్యంగా ఉండొచ్చని పేర్కొంటున్నాడు రైతు గోవర్ధన్‌రెడ్డి.

23 రకాల వరి వంగడాల సాగు

గతంలో నాలుగు రకాల వరి వంగడాలను పండించానని, విత్తన బ్యాంకు కోసం ఈ సారి ఒక్క గుంట విస్తీర్ణంలో 23రకాల వరి వంగడాలు సాగుచేశానని గోవర్ధన్‌రెడ్డి తెలిపాడు. కాలానమ్మక్, కాలాబట్టి, కృష్ణవ్రీహీ, నారాయణ కామిని, బహురూపి, తులంపంజి, సీరగసాంబ, ఇంద్రాణి, పొక్కార్, మాపల్లె సాంబ, ఇల్లపు సాంబ, మట్టరైస్, తూయపల్లి, కాలజీర, పూంగార్, చిట్టిముత్యాలు, మణిపూర్‌బ్లాక్, చికిలకోయిల, కబిరాజ్‌పాల్(డాక్టర్ రైస్), రాజముడి, కర్పుకవణి, గరుడన్‌సాంబ, కరుంగ్‌కురువై వంగడాలను ఆయన సాగు చేశాడు. కాలానమ్మక్ గౌతమ బుద్ధుని కాలం నాటిదని, బహురూపి బియ్యం శ్రీకృష్ణదేవరాయలు ఇష్టంగా తినేవారని, రాజముడి రైస్‌ను మైసూరు మహారాజులు తినేవారని, కబిరాజ్‌పాల్ రైస్‌ను డాక్టర్ రైస్ అంటారని, వాటిని ఇప్పటికీ పశ్చిమ బెంగాల్‌లో ట్రైబల్ ఏరియాలో తింటున్నారని, వాటిని తింటే డాక్టర్ వద్దకు వెళ్లాల్సిన పని ఉండదని చెబుతారని చెబుతున్నాడు. ఈ వంగడాల్లో అత్యధికం వివిధ రకాలు మెడిసిన్ వ్యాల్యూ ఉన్నవేనంటున్నాడు. కాలాబట్టి, మణిపూర్ బ్లాక్ క్యాన్సర్ నిరోధక శక్తి కల్గినవని, నారాయణ కామిని మోకాళ్లనొప్పుల నివారిస్తుందని, ఇల్లపుసాంబ మైగ్రేన్ సమస్యను తగ్గిస్తుందని, పూంగార్ రైస్‌లో కాల్షియం, ఐరన్ ఎక్కువగా ఉంటుందని, చికిలకోయిల రైస్ కిడ్నీ సంబంధిత వ్యాధులను నివారిస్తుందని, ఇలా ప్రతి వంగడంలో ఏదో ఓ ప్రత్యేకత ఉందంటున్నాడు.

దిగుబడి తక్కువైనా... ధర ఎక్కువ


హైబ్రీడ్ వరి వంగడాలతో పోల్చుకుంటే పురాతన వరి వంగడాల దిగుబడి తక్కువ. అయినా రేటు ఎక్కువగా ఉంటుందన్నాడు. ఎకరాకు 15నుంచి 20 బస్తాల దిగుబడే వస్తుందన్నాడు. బియ్యం ధర క్వింటాల్‌కు రూ.పది వేల వరకు ఉంటుందని తెలిపారు. ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకుండా సేంద్రియ ఎరువులు, జీవామృతం, కషాయాలు మాత్రమే వాడుతున్నందున పెట్టుబడి కూడా తగ్గుతుందన్నారు గోవర్ధన్‌రెడ్డి.

ఇంటి కోసమైనా ఈ వంగడాలు సాగుచేయాలి



ఈ విత్తనాలు సేకరించడానికి సుమారు రూ.20 వేలు ఖర్చు చేశాను. నేను నాలుగేళ్లుగా సాగు చేస్తున్న బహురూపి బియ్యం తింటున్నాను. కూరగాయలు కూడా సేంద్రీయ పద్ధతిలోనే పండించుకుంటున్నాం. ప్రతి రైతు మన పూర్వీకులు ఎందుకు అంత బలంగా ఉండేవారో ఆలోచించాలి. ఆనాటి వరి (బియ్యం)లో బలమైన పోషకాలు ఉండేవి అన్నది గ్రహించాలి. ప్రతి రైతు అమ్మడానికి కాకపోయిన తన ఇంటి అవసరాలకోసమైనా పాత వరి వంగడాలను సాగు చేయాలి. వారు ఆరోగ్యంగా ఉంటారు. గతంలో ఏనాడు లేనంతగా బీపీలు, షుగర్లు, గుండెపోట్లు, కిడ్నీ సమస్యలు ఇప్పుడు రావడానికి కారణం మనం తినే మందుల తిండే.

● బిల్లపాటి గోవర్ధన్‌రెడ్డి, రైతు.


కాలానమ్మక్ వరి పొలం

న్యాయం చేయాలని ఆందోళన

● వైద్యుడి నిర్లక్ష్యంతో మహిళ మృతిచెందిందని ఆరోపణ ● పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన ● సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో ఘటన

తిరుమలగిరి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వైద్యుడి నిర్లక్ష్యంతో వైద్యం వికటించి మహిళ మృతిచెందిందని ఆరోపిస్తూ. కుటుంబసభ్యులు సూర్యాపేట జిల్లా తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ వద్ద మృతురాలి బంధువులు, కుటుంబ సభ్యులు బుధవారం ఆందోళన చేశారు. మృతురాలి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా కొడకండ్ల మండలం బోడోనికుంటతండాకు చెందిన ధరావత్ రాజు భార్య వినోద(36)కు తిరుమలగిరిలోని వెన్నెల ఆస్పత్రిలో ఐదు నెలల క్రితం ఆపరేషన్ చేసి గర్భసంచి తొలగించారు. ఆపరేషన్ చేస్తున్న సమయంలో తీవ్ర రక్తస్రావం కావడంతో వెంటనే డాక్టర్ ఆమెను హన్మకొండలో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు పంపించారు. అక్కడ పరీక్షించిన డాక్టర్లు మూత్రనాళం కట్ అయిందని చెప్పారని, ఆమెకు తిరుమలగిరిలో వైద్యం చేసిన డాక్టరే వైద్య ఖర్చుల కోసం సుమారు రూ.2లక్షలు హన్మకొండ హాస్పిటల్‌లో చెల్లించాడని తెలిపారు. ఇంటికి వచ్చి వైద్యం అందించాడని తెలిపారు. ఐదు నెలలుగా వైద్యం అందిస్తున్నామని అయినా కోలుకోకపోవడంతో పరిస్థితి విషమంగా మారడంతో సోమవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లామని చికిత్సపొందుతూ మంగళవారం రాత్రి వినోద మృతిచెందిందని తెలిపారు. న్యాయం చేయాలని తిరుమలగిరిలోని ఆస్పత్రికి వస్తే వినోద మృతిచెందిన విషయం తెలిసి ఆస్పత్రి మూసేసారని, న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. వైద్యం చేస్తున్నప్పుడు వైద్యుడి నిర్లక్ష్యంతో వినోద మృతిచెందిందని కుటుంబసభ్యులు ఆరోపించారు. వినోదకు ఇద్దరు కుమార్తెలు, ఓకుమారుడు ఉన్నారు. వినోదకు తాను వైద్యం చేయలేదని, హైదరాబాద్ నుంచి స్పెషలిస్ట్ డాక్టర్‌ను పిలిపించి గర్భసంచి ఆపరేషన్ చేయించినట్లు డాక్టర్ మురళీధర్ తెలిపారు. ఆపరేషన్ చేస్తున్నప్పుడు ఆమెకు కాన్సర్ ఉన్నట్లు తెలిసిందని, ఆపరేషన్ చేసిన డాక్టర్ క్యాన్సర్ వైద్యం చేయించుకోవాలని సూచించినట్లు తెలిపారు. సుమారు మూడు గంటల పాటు పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. పోలీసులు ముందుస్తుగా నాగారం సర్కిల్ పోలీసులను తిరుమలగిరికి రప్పించారు. ఇరు పరక్షాల పెద్దమనుషుల సమక్షంలో, మృతురాలి కుటుంబసభ్యులకు రూ.3 లక్షల నష్టపరిహారం చెల్లించేందుకు వైద్యుడు అంగీకరించినట్లు తెలిసింది.


పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న వినోద కుటుంబసభ్యులు

1800 కిలోల నల్ల బెల్లం, 80 కిలోల పటిక స్వాధీనం

కొండమల్లేపల్లి, నవంబర్ 19(ఆంధ్రజ్యోతి: నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల పరిధిలోని చెన్నారం గేటు వద్ద ఎక్సైజ్ పోలీసులు బుధవారం నల్ల బెల్లం, పటిక స్వాధీనం చేసుకున్నారు. దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... వాహన తనిఖీలలో చెన్నారం గేటు నుంచి కొండమల్లేపల్లికి వెళ్లే రోడ్డు మార్గంలో అశోక్ లేలాండ్ మినీ వాహనంలో ఇద్దరు వ్యక్తులు 1800 కిలోల నల్ల బెల్లం, 80 కిలోల పటిక తరలిస్తున్నారు. అనుమానంతో వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అందులో నల్లబెల్లం, పటిక లభించింది. దీంతో దేవరకొండ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ తనిఖీలో ఎక్సైజ్ ఎస్ఐ నరసింహ, వీరబాబు, కానిస్టేబుల్ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన హంగులు.. సాంకేతికత తోడు

● గరిడేపల్లి పోలీస్‌స్టేషన్ రూపురేఖలు మార్చిన ఎస్ఐ నరేష్ ● పోలీస్‌స్టేషన్ పరిధిలో 57 సీసీ కెమెరాలు ఏర్పాటు



పోలీస్‌స్టేషన్‌లో కమాండ్ కంట్రోల్ రూంను ప్రారంభిస్తున్న ఎస్పీ నర్సింహ(ఫైల్)

గరిడేపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అది సూర్యాపేట జిల్లా గరిడేపల్లి పోలీస్‌స్టేషన్.. గతంలో అరకొర వసతులతో ఉన్న స్టేషన్‌ను నూతన హంగులతో తీర్చిదిద్దారు ఎస్ఐ చలికంటి నరేష్. దానికి తోడు సాంకేతికతను ఉపయోగించి పోలీస్‌స్టేషన్ పరిధిలో 57సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. అక్కడే మానిటరింగ్ కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేయించారు. సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని ఏడు పోలీస్‌స్టేషన్లలో పైలెట్ ప్రాజెక్ట్ కింద తీసుకొని 150సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ ప్రకటించారు. ఒక్క గరిడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోనే ఎస్ఐ నరేష్ 57 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. స్టేషన్‌లోనే మానిటరింగ్ కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేయించి ఎస్పీ కె. నర్సింహతో ప్రారంభించి మానిటరింగ్ చేయిస్తున్నారు.

పోలీస్‌స్టేషన్‌లో సౌకర్యాలపై దృష్టి

ఫిర్యాదుదారులు కూర్చొనేందుకు వీలుగా ఒక గది ఏర్పాటు చేశారు. గతంలో వర్షం వస్తే పోలీస్‌స్టేషన్ కురవడంతో పాటు వారం రోజుల పాటు వర్షం నీరు నిలిచేది. పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో 15టిప్పర్ల మొరం పోయించి వర్షం నీరు నిల్వకుండా డ్రైయినేజీలోకి వెళ్లేలా ఏర్పాటు చేశారు. కోదాడ, మిర్యాలగూడ హైవే-167 రహదారి మండలంలో సుమారు 13కిలో మీటర్ల మేర ఉంది. నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతుండేవి. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ స్టాప్ బోర్డులు ఏర్పాటు చేయించి ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నారు.


నూతన హంగులతో ఏర్పాటైన పోలీస్‌స్టేషన్

నిరంతర నిఘా..

గతంలో అరకొరగా సీసీ కెమెరాలు ఉన్నా అవి పనిచేసేవి కావు. దాతల సహకారంతో ప్రస్తుతం గరిడేపల్లిలో 25, మండలంలోని వివిధ గ్రామాల్లో 27 కలిపి మొత్తం 57 సీపీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. గరిడేపల్లి పోలీస్‌స్టేషన్ నిర్మించి సుమారు 45సంవత్సరాలు కావొస్తోంది. గతంలో స్టేషన్‌లోని సౌకర్యాలు ఉండేవికావు. సిబ్బంది విశ్రాంతి తీసుకోవడానికి, వారి వాహనాలు నిలుపుకునేందుకు కూడా సరైన వసతి ఉండేది కాదు. ఎస్‌గా చలికంటి నరేష్ బాధ్యతలు తీసుకున్నాక పోలీస్‌స్టేషన్ రూపురేఖలు మార్చేశారు.

పోరాడారు.. రోడ్డు సాధించారు

● సూర్యాపేటలో మహిళల ధర్నా ● రెండు గంటల వ్యవధిలోనే బీటీ రోడ్డు వేయించిన అధికారులు



సూర్యాపేట జిల్లాకేంద్రంలోని అంజనాపురి-జనగాం రోడ్డును కలిపే రహదారిపై ధర్నా చేస్తున్న మహిళలు

భానుపురి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆ రోడ్డుపై నుంచి వెళ్లే వాహనాలతో వచ్చే దుమ్ముధూళి ఇళ్లలోకి వచ్చి స్థానికులు ఇబ్బందులు పడేవారు. సంవత్సరానికి పైగా పనులు కొనసాగుతుండడంతో నిత్యం ఇబ్బంది పడుతున్నామని స్థానిక మహిళల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దీంతో మహిళలంతా ఏకమై ఆందోళనకు దిగారు. దిగి వచ్చిన అధికారులు రెండు గంటల వ్యవధిలోనే రోడ్డు వేశారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని అంజనాపురి- జనగాం క్రాస్‌రోడ్డుకు వెళ్లే రహదారిపై దుమ్ముధూళి లేచి ఇళ్లలోకి వస్తోంది. వజ్రా వెంచర్‌కాలనీ మహిళలు, కాలనీవాసులు సమారు వంద మంది రెండు గంటల పాటు ధర్నా చేశారు. 365 జాతీయ రహ దారిపై ఉన్న జనగాం క్రాస్‌రోడ్డులో సంవత్సరం నుంచి బ్రిడ్జి నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. పట్టణానికి వరంగల్, జనగాం, తిరుమలగిరి వైపునుంచి వాహనాలు వస్తుంటాయి. ఆటోలు, ట్రాక్టర్లు, లారీలు, బస్సులు, ద్విచక్రవాహనాలు జాతీయ రహదారి మీదుగా అంజనాపురి, జనగాం క్రాస్‌రోడ్డుకు రహదారి ఉంది. ఈ రహదారి ఇరుకుగా ఉన్నా వాహనాలు వెళ్తున్నాయి. సామర్థ్యానికి మించి మించి వాహనాలు లోడు తీసుకెళ్తుండడం, రద్దీగా ఉండడంతో రోడ్డు ధ్వంసమైంది. ఆ రహదారిపై పురపాలక శాఖ ద్వారా కాంట్రాక్టర్ రెండు, మూడు సార్లు మరమ్మతులు చేశారు. రహదారి వేయడానికి కంకర డస్టు పోసి నెల దాటింది. ఈ రహదారిపై నిత్యం వాహనాలు తిరుగుతుండడంతో దుమ్ముధూళి ఇళ్లలోకి వస్తోందని, నిత్యం ఇబ్బంది పడుతుండడంతో వజ్రా వెంచర్ కాలనీలో నివాముండే మహిళలు బుధవారం ధర్నాకు దిగారు. సుమారు రెండు గంటల పాటు ఆందోళన చేశారు. దీంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న మునిసిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి జాతీయ రహదారి కాంట్రాక్టర్‌కు వెంటనే రోడ్డు వేయాలని ఆదేశిం చారు. దీంతో వాహనాల్లో బీటీ వేయడానికి డాంబర్ కలిపిన మెటిరియల్ తీసుకొచ్చి వేశారు. ఆందోళనకు స్పందించి అధికారులు పనులు చేయించడంతో సంతోషం వ్యక్తం చేశారు.



నూతనంగా వేస్తున్న బీటీ రోడ్డు

రోడ్డు బాగు చేయండి మహాప్రభో..

● మోత్కూరు మండలం పనకబండ చౌరస్తాలో మోకాళ్లపై నిల్చొని రాస్తారోకో



మోకాళ్లపై నిల్చుని నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

మోత్కూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు పనకబండ చౌరస్తా నుంచి రాజగూడెం శివారు వరకు రోడ్డును వెంటనే బీటీగా మార్చాలి డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు బుధవారం ఆందోళన చేశారు. ఆ రోడ్డుపై మోకాళ్లపై నిల్చొని రాస్తారోకో నిర్వహించారు. పనకబండ చౌరస్తా నుంచి రాజన్నగూడెం శివారు వరకు సుమారు మూడున్నర కిలోమీటర్ల దూరం బీటీ చేయడానికి రూ.5.80 కోట్లు మంజూరై మూడేళ్లు అవుతున్నా రోడ్డు మాత్రం బీటీ చేయలేదని వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టర్ కొద్దిదూరం బీటీ చేసి పని వదిలేసి వెళ్లిపోయాడని, అధికారులు వేరే కాంట్రాక్టర్‌తో పనులు చేయించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. గుంతలమయమైన రోడ్డుపై ఆర్టీసీ బస్సుల్లో, ఇతర వాహనాల్లో వెళ్తున్నప్పుడు కుదుపులకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనదారులు పడి గాయాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డును బీటీ చేయడంతో పాటు అంబేద్కర్ చౌరస్తా నుంచి ఇందిరానగర్ కాలనీ వరకు మోత్కూరు-నార్కట్‌పల్లి రోడ్డులో డివైడర్ వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షురాలు చాడ మంజులరెడ్డి, ఉపాధ్యక్షుడు కందుకూరి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి అన్నెపు సత్యనారాయణ, ముత్తినేని తిరుమలేష్, బొట్లు అబ్బయ్య, గౌరు శ్రీనివాస్, పోచం సోమయ్య, దీటి సందీప్, బద్దం మహేందర్‌రెడ్డి, మనోహర్, రేణుక, సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సాదాబైనామాల క్రమబద్ధీకరణ సవాలే

» సాంకేతిక సమస్యలతో సతమతం
» మిర్యాలగూడ డివిజన్‌లో 60 శాతం క్లియరెన్స్

(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ)

తెలిసో, తెలియకో తెల్లకాగితంపై ఒప్పందం చేసుకుని(సాదాబైనామా) భూములు కొనుగోలు చేసిన వారి సమస్యకు శాశ్వత పరిష్కార దిశగా అధికారులు ప్రయత్నిస్తున్నప్పటికీ సవాళ్లు తప్పడం లేదు. చిన్న రైతులకు ఊరట కలిగించే దిశగా ప్రభుత్వం సాదాబైనామాల భూములను 2025 భూభారతి చట్టం ద్వారా క్రమబద్ధీకరించే ప్రకియను చేపట్టింది. అయితే సాదాబైనామా రిజిస్ట్రేషన్ ప్రక్రియ రెవెన్యూ అధికారులకు సంక్లిష్టంగా మారింది. కొన్ని సాంకేతిక సమస్యలతో దరఖాస్తులను పరిష్కరించలేక అధికారులు పెండింగ్ పెడుతున్నారు. ప్రభుత్వ భూ ములు కొనుగోలు చేసిన వారికి, విక్రయించిన పేరున డాక్యుమెంట్లు లేకపోవడం, కుటుంబ పెద్ద విక్రయించిన భూమిని అనంతరం కాలంలో వారుసుల పేరున మారడం, ప్రభుత్వ భూమిని కొనుగోలు చేయడం లాంటి కారణాలతో సాదాబైనామాల దరఖాస్తుల పరిష్కారం త్వరగా పూర్తి కావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాదాబైనామా దరఖాస్తుల క్రమ



బద్ధీకరణకు భూమి విక్రయించిన యజమాని తహసీల్దార్ కార్యాలయానికి హాజరుకావాలని రెవెన్యూ అధికారులు తేల్చి చెప్పడంతో సమస్య మళ్లీ మొదటికి వస్తుందని కొనుగోలుదారులు పేర్కొంటున్నారు.

సవాల్‌గా మారుతున్న సమస్యలు

భూభారతి చట్టం-2025లోని సెక్షన్-6 ప్రకారం 2014 జూన్ 2 నాటికి ముందుగా సాగులో ఉన్నారని ఆదారాలు చూపగలిగితే ఆ రైతుల భూ మిని రెగ్యులరైజ్ చేసే వీలుంది. అమ్మకం కొనుగోలు మాత్రమే సాదాబైనామాలో చెల్లుబాటు అవుతుండగా గిఫ్ట్‌గా ఇచ్చిన వాటిని చెల్లుబడి కావడం లేదు. సాదాబైనామాల క్రమబద్ధీకరణలో ఐదు ఎకరాలలోపు వ్యవసాయ భూముల కలిగిన రైతులు రేషన్ కార్డు కలిగిన వారికే సాదాబైనామాల క్రమబద్ధీకరించుకునే వీలుంది. ఎకరం గతంలో ఉండి మరో ఐదెకరాలు కొన్నవారికి ఇది వర్తించదు. దరఖాస్తు తిరస్కరించబడుతుంది. రెవె న్యూ అధికారులు రేషన్‌కార్డు ప్రామాణికంగా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. రీ సర్వే సెటిల్‌మెంట్ రిజిష్టర్(ఆర్ఎస్ఆర్) ప్ర కారం ఆన్‌లైన్‌లో అమ్మినవారి పేరులేక పోయినట్లయితే ఆ దరఖాస్తులు కూడ తిరస్కరణకు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది. పీవోబీ, పీవో టీలో ఉన్న భూములకు సాదాబైనామా వర్తించే పరిస్థితి లేదు. దీనివల్ల భూములు ఉంది సాగు చేసుకుంటున్నప్పటికీ ప్రభు త్వం ఇచ్చే రాయితీలు అందడం లేదు. బ్యాంకుల నుంచి రుణాలు పొందలేక పోతున్నట్లు తెలిపారు. రైతుబంధు సాయం దక్కడం లేదని రైతు బీమా పథకం, ప్రధాన మంత్రి కిసాన్ యోజనకు అర్హులం కాకుండా పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చివరకు సేల్ డెడ్‌నే దిక్కు

మిర్యాలగూడ మండల పరిధిలోని ఓ గ్రామంలో సొంత అన్న వద్ద నుంచి 15 ఏళ్ల క్రితం సుమారు 5 లక్షలకు ఎకరం చొప్పున 6 ఎకరాల వ్యవసాయ భూమి చెల్లె కొనుగోలు చేసింది. పెద్దమనుషుల సమక్షంలో ఓ కాగితంపై ఒప్పందం రాసుకున్నారు. నాటి నుంచి చెల్లెలు ఆ భూమిని సాగు చేసుకుంటూ వస్తోంది. సొంత అన్న అనే భావనతో రిజిస్ట్రేషన్ తరువాత చేయించుకుందామని వాయిదా వేసుకుంటూ వచ్చింది. కొంత కాలం ఆమె కూతురుకు వివాహం జరగగా సదరు భూమిని అమ్మాయి పేరున రిజిస్ట్రేషన్ చేస్తానని వాగ్దానం చేసింది. ఒప్పందం పత్రం తీసుకుని రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లి భూమి రిజిస్ట్రేషన్ చేయమని అడిగితే పట్టాదారు పాస్ బుక్ తీసుకొనిరమ్మని చెప్పారు. అన్న దగ్గరకు వెళ్తే నా వద్ద అప్పుడు తక్కువ దరకు భూమి కొన్నావు. ఇప్పుడు ధర పెరిగింది. ప్రస్తుతం నాకు రూ. 20 లక్షలు ఇస్తేనే తహసీల్దార్ వద్దకు వచ్చి సంతకం చేస్తానని బేరాలకు దిగాడు. విధిలేని పరిస్థితిలో గ్రామ పెద్దల సమక్షంలో రూ. 8 లక్షల 50వేలకు అన్నతో ఒప్పదం కుదుర్చుకుని డబ్బులు ఇచ్చి కూతురు పేరున సేల్‌డీడ్ చేయించుకుంది.

డివిజన్‌లో 13,185 దరఖాస్తులు

2020 అక్టోబరు 20 నుంచి నవంబరు 19 వరకు సాదాబైనామాల కోసం నల్లగొండ జిల్లా 28,313 దరఖాస్తులు చేసుకున్న మిర్యాలగూడ డివిజన్‌లో 13,185మంది దరఖాస్తు చేసుకున్నారు. అడవిదేవులపల్లి మండలంలో 410 దరఖాస్తులు, అనుముల 665, దామరచర్ల 1,600, మాడ్గులపల్లి1,885 మిర్యాలగూడ, 2,623, నిడమనూరు 654,పెద్దవూర 719, తిరుమలగిరి సాగర్ 1,865, త్రిపురారం 1,283, వేములపల్లి మం డలం నుంచి 1,481 దరఖాస్తులు చేసుకున్నారు.

సాదాబైనామా పరిష్కారంలో డివిజన్ ప్రథమ స్థానం



నల్లగొండ జిల్లా సాదాబైనామాల దరఖాస్తుల పరిష్కారంలో మిర్యాలగూడ డివిజన్ ప్రథమంలో వుంది. 13,185 దరఖాస్తుల్లో 6వేల దరఖాస్తులను పరిష్కరించడం జరిగింది. క్షేత్ర స్థాయిలో ఎదురౌవుతున్న సమస్యల వల్ల కొంత ఆలస్యం అవుతుంది. రెవిన్యూ యంత్రాంగం ప్రత్యేక చొరవతో సమస్యలను పరిష్కరిస్తుంది.

-నారాయణ అమిత్, సబ్‌కలెక్టర్,మిర్యాలగూడ

కొబ్బరికాయల వేలం రూ.43.50లక్షలు



ఎల్లారెడ్డిగూడెం గ్రామపంచాయతీలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

నార్కట్‌పల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో ఏడాది కాలపరిమితికి నిర్వహించిన కొబ్బరికాయల విక్రయ వేలం ధర రూ.43.50 లక్షలు పలికింది. ముందుగానే ప్రకటించిన మేరకు బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఐదో పర్యాయం నిర్వహించిన బహిరంగ వేలానికి మొత్తం ఏడుగురు వేలందారులు హాజరయ్యారు. ఎల్లారెడ్డిగూడెంనకు చెందిన పనస సతీష్ అత్యధికంగా రూ.43.50లక్షలు పాడారు. రెండవ పాటదారునిగా చిక్కుళ్ల శివ రూ.43.40లక్షలు పాడారు. టెండర్ అనుమతి కోసం డీపీవోకు నివేదిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో వెంకటేశ్వర్లు, జీపీ ప్రత్యేకాధికారి ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఎంపీవో సుధాకర్, పంచాయతీ కార్యదర్శి చిరుమర్తి వెంకన్న, వడ్డే భూపాల్‌రెడ్డి, నల్ల వెంకన్న గ్రామస్థులు పాల్గొన్నారు.

కోతులను పట్టివేతకు శ్రీకారం

చౌటుప్పల్ టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న కోతులను బోనుల ద్వారా పట్టించే కార్యక్రమానికి మునిసిపాలిటీ శ్రీకారం చుట్టింది. రెండు రోజుల్లో 82 కోతులను పట్టి అడవుల్లో వదిలివేశారు. పాఠశాలల వద్ద విద్యార్థులతో పాటు కాలనీలలో ప్రజలను, బాటసారులను కోతులు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. చేతుల్లో సంచులు కనిపిస్తే ఎగబడి దాడి చేస్తున్నాయి.

అంతేకాక ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. పట్టణంలో తిరుగుతున్న కోతులను పట్టించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని, అందుకు ప్రజలు సహకరించాలని మునిసిపల్ కమిషనర్ జి. వెంకట్రాంరెడ్డి కోరారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు కోతులను పట్టించే కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో యాద'గిరి' ప్రదక్షిణ

• భజన కీర్తనలతో సాగిన నడక యాత్ర



గిరిప్రదక్షిణ పూర్తి చేసుకొని స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

యాదగిరిగుట్ట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో బుధవారం స్వాతి నక్షత్ర వేడుకలు, సత్యదేవుని వ్రతాలు, కార్తీకదీపాలు వెలిగించి భక్తులు ఆధ్యాత్మిక తన్మయత్వం పొందారు. ఆలయంలో వేకువజామున అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. వైకుంఠద్వారం నుంచి సామూహిక గిరిప్రదక్షిణ వైభవంగా కొనసాగింది. తెల్లవారుజామున 5.30 గంటలకు అర్చకుల వేద మంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాల నడుమ అర్చకులు హారతి సమర్పించి మొక్కులు చెల్లించి ప్రదక్షిణ ప్రారంభించారు. గిరిప్రదక్షిణ చేసిన భక్తులకు క్షేత్రం ఉత్తరదిక్కులో 1,500 ఉచిత దర్శన టికెట్లు అధికారులు పంపిణీ చేశారు. మధ్యాహ్నం ఆరగింపు సమయం (12 గంటలకు) వరకు సుమారు 30వేల మంది భక్తులు ప్రదక్షిణ పూర్తి చేశారు.

అధిక సంఖ్యలో భక్తుల రాక

యాదగిరిగుట్ట క్షేత్రానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉభయ క్యూలైన్‌లో భక్తులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తుల రద్దీ ఉండగా ఉదయం, సాయంత్రం బ్రేక్ దర్శనాలు, మధ్యాహ్నం ఆరగింపు సమయం కలిపి 3 గంటల పాటు వేచి ఉన్నారు. యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు పర్యవేక్షణలో పట్టణ ఇన్‌స్పెక్టర్ బొడ్డుపల్లి భాస్కర్ సారథ్యంలో పోలీసులు భక్తులకు బందోబస్తు నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామికి సువర్ణ పుష్పార్చన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శివాలయంలోనూ పూజలు కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 33,43,041 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. కాగా, కొండకింద మండపాల్లో 760 మంది దంపతులు సత్యదేవుని వ్రతాలు జరిపించారు. స్వామిని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే.శివసేనరెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్ వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి ప్రధానార్చకుడు భట్టర్‌సురేంద్రాచార్యులు బృందం ఆశీర్వచనం అందజేశారు.

ఉద్యమాలతోనే ప్రజా సమస్యల పరిష్కారం

• సీపీఐ జాతీయ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

నల్లగొండరూరల్, చౌటుప్పల్‌టౌన్, గట్టుప్పల, చిట్యాల, నార్కట్‌పల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం జరుగుతుందని సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సీపీఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖమ్మంలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ ఈ నెల 15న గద్వాల నుంచి ఖమ్మం వరకు కొనసాగుతున్న ప్రచార బస్సు జాత బుధవారం యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో వారు మాట్లాడుతూ సీపీఐ నూరేళ్ల చరిత్రను గ్రామగ్రామాన ప్రజలకు వివరించి చైతన్య పరుస్తున్నామని వారు అన్నారు. ఎన్నికల్లో చేసిన హామీలను ప్రభుత్వం అమలు చేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీపీఐ 100ఏళ్ల ముగింపు ఉత్సవాల సందర్భంగా ఖమ్మంలో వచ్చే నెల 26వ తేదీన నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని వారు కోరారు. నల్లగొండలో బస్సుజాత పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. మర్రిగూడ బైపాస్ నుంచి గడియారం సెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. జాతకు నాయకత్వం వహిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాల నర్సింహ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌ను శాలువా పూలమాలలతో సన్మానించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ పెట్టుబడిదారులకు, భూసామ్య పెత్తందారులకు వ్యతిరేకంగా పేద ప్రజ ల పక్షాన నిలబడి సీపీఐ సమరశీల పోరాటాలు నిర్వహించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు మల్లేపల్లి ఆదిరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్‌రెడ్డి, లొడంగి శ్రవణ్‌కుమార్, నాయకులు పబ్బు వీరస్వామి, బొ ల్లురి నర్సింహ, గురిజ రామచంద్రం, వెంకటేశ్వర్లు, కెఎస్ రెడ్డి, చాపల శ్రీను, అక్బర్, ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షుడు జగన్ పాల్గొన్నారు.

● చౌటుప్పల్‌లో ఈ జాతకు మునిసిపల్ మాజీ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు సంఘీబావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఎం.బాలనర్సింహ, జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్య క్షుడు కె.శ్రీనివాస్, నాయకులు బి.గాలయ్య, పల్లె శేఖర్ రెడ్డి, ఇమ్రాన్, సుదర్శన్, భాస్కర్, మోహన్‌రెడ్డి, సంజీవ పాల్గొన్నారు.

● గట్టుప్పలలో భారీ ఎత్తున బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. మండలకేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడు తూ దేశంలో అనేక పోరాటాలతో, త్యాగాలతో పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా సీపీఐ పేదల పక్షాన నిలబడిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన చట్టాల కోసం నిరంతరం సీపీఐ పోరాటాలు నిర్వహించిందని అన్నారు. పత్తి కొ నుగోళ్ల విషయంలో సీసీఐ కొనుగోళ్లు ఎ కరానికి 7 క్వింటాళ్లకు పరిమితి చేయడాన్ని ఆయన విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురుజ రామచంద్రం, తీర్పారి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్, చాపల శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి, జగన్, రాపోలు సత్తయ్య, యాదయ్య, లక్ష్మయ్య, ముత్యం పాల్గొన్నారు.



నల్లగొండలో బస్సుయాత్ర నల్లగొండ చేరుకున్న సందర్భంగా మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే 'ఆపరేషన్ కగార్'

ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ఆపరేషన్ కగార్ పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ప్రచారజాత చిట్యాలకు చేరుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఆర్థిక అసమానతలు లేని సమాజం కోసం సీపీఐ పోరాడుతుందని అ న్నారు. దేశస్వాతంత్ర్య పోరాటంలో సీపీఐ అగ్రభాగాన ఉందన్నారు. వందేళ్ల చరిత్రలో ఎన్నో పోరాటా లు, త్యాగాలు ఉన్నాయని గుర్తుచేశారు. కమ్యూనిస్టుల అనైక్యత వల్లే బూర్జువా పార్టీలు రాజ్యమేలుతున్నాయని తెలిపారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రావణ్‌కుమార్, మండల కార్యదర్శి ఎండీ అక్బర్, బొడిగె సైదులు, ఎస్‌కే షరీఫ్, మునుకుంట్ల నాగయ్య, జిల్లా సత్యం, దేశగోని రావుల చినవెంకన్న, లింగయ్య, నర్సింహ పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లిలో మాట్లాడుతూ అసమానతలు లే ని సామాజిక న్యాయం, మార్పు కోసం సీపీఐ పో రాటం చేసిందని ఎమ్మెల్సీ సత్యం అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి పెండ్యాల శంకర్, నాయకులు వెంపటి శ్రీనివాస్, శ్రీపతి స్వామి, అక్బర్, నర్సింహ, నజీర్, షరీఫ్ పాల్గొన్నారు.

మాన్‌తండాలో శిశువిక్రయ కలకలం

● శిశుసంక్షేమ శాఖ ఫిర్యాదుతో పోలీసుల విచారణ
● నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలో ఘటన

దామరచర్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం మాన్‌తండాలో శిశు విక్రయం కలకలం రేగింది. దామరచర్ల సీడీపీవో చంద్రకళ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దామరచర్ల మండలంలోని మాన్‌తండాలో పిల్లలు లేని రెండు కుటుంబాల్లో ఓ కుటుంబం వద్ద 20 రోజుల వయసు ఉన్న పాప, మరో కుటుంబం వద్ద నెల రోజుల వయసున్న బాబు ఉన్నట్లు శిశు సంక్షేమ శాఖకు సమాచారం అందింది. దీంతో ఈ నెల 15వ తేదీన ఐసీడీఎస్ అధికారులు విచారణ చేయగా, తమ బంధువుల పిల్లలుగా వారు సమాధానమిచ్చారు. బుధవారం ఐసీడీఎస్ అధికారులు మాన్‌తండాలోని దంపతులను మరోసారి విచారించగా బంధువుల పిల్లలు అని, దత్తత తీసుకున్నామని పొంతన లేని సమాధానాలు చెప్పారు. ఈ క్రమంలో వాస్తవాలను తెలుసుకునేందుకు శిశు సంక్షేమశాఖ అధికారులు దామరచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణ ఆధారంగా శిశువులను బాలల సంక్షేమ సమితికి అప్పగించనున్నట్లు సీడీపీవో చంద్రకళ తెలిపారు. ఈ విషయమై దామరచర్ల ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డిని వివరణ కోరగా శిశుసంక్షేమ శాఖ అధికారుల ఫిర్యాదుతో విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

నార్కట్‌పల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం బుధవారం కావడంతో నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో సుప్రభాత సేవతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అద్భుతంగా అలంకరించిన అయ్యప్ప మూలవిరాట్‌ను స్వాములు, భక్తులు దర్శించుకున్నారు. భజన కీర్తనలతో ఆలయం మారుమ్రోగింది. అనంతరం మధ్యాహ్నం ప్రజ్ఞాపురం కోటయ్య కుటుంబ సభ్యులు అయ్యప్ప స్వాములకు భిక్షదానం చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లి వెంకన్న గురుస్వామి, పుల్లెంల అచ్చాలు, వేముల నర్సింహ, జెరిపోతుల భరత్ పాల్గొన్నారు.

2 నుంచి హాలియాలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

హాలియా, నవంబరు19(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా హాలియా పట్టణంలోని టైం పాఠశాల ఆవరణలో డిసెంబరు 2,3,4 తేదీల్లో 51వ జూనియర్ బాలికల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్గనైజింగ్ కన్వీనర్ జి.కర్తయ్య, కోకన్వీనర్ ఆర్.భూలోకరావు తెలిపారు. హాలియాలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ పోటీలను నల్లగొండ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పగలు, రాత్రి వేళల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల బాలికల బృందాలు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హార్డ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బి.వెంకటరత్నం, రాష్ట్ర టెక్నికల్ సభ్యుడు సీహెచ్.డొమినిక్, జిల్లా కోశాధికారి జై.చంద్రయ్య, టైం పాఠశాల కరస్పాండెంట్ మందా నరేందర్‌రెడ్డి, కోటిరెడ్డి, కార్యవర్గ సభ్యులు యడవల్లి రాంబాబు, అన్వర్‌ఖాన్, సత్యనారాయణ, పరమేష్, సైదులు పాల్గొన్నారు.

రేపు భువనగిరిలో అథ్లెటిక్ పోటీలు

భువనగిరి గంజ్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21న ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బాలికలకు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కోనేటి గోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు 14 సంవత్సరాలలోపు బాలికలు అర్హులని పేర్కొన్నారు. ఖేలో ఇండియా ఆధ్వర్యంలో అస్మితలీగ్‌ను గ్రామీణ స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యంగా పోటీలకు ఎంపికవుతారని తెలిపారు.

అండర్-14: ట్రయాథ్లాస్-ఏ: (60 మీటర్ల పరుగు), లాంగ్ జంప్ (5మీటర్లు అ ప్రోచ్), హైజంప్ (సీజర్ గేమ్), ట్రయాథ్లాస్-బీ: (60మీటర్లపరుగు), లాంగ్‌జంప్ (5మీట ర్లు అప్రోచ్), షార్ట్‌పుట్ బ్యాక్‌త్రో, ట్ర యాథ్లాస్-సీ: (60మీటర్ల పరుగు), లాంగ్ జంప్ (5మీటర్లు అప్రోచ్),600మీటర్ల పరుగు.

అండర్-16: 600మీటర్ల పరుగు, హైజంప్ (సీజర్‌గేమ్), లాంగ్ జంప్ (5మీటర్ల అప్రోచ్), డిస్కస్ త్రో, షార్ట్ పుట్ (స్టాండింగ్ త్రో), జావెలిన్ త్రో (500 గ్రా-10మీటర్ల అప్రోచ్). తదితర పోటీల్లో ఆన్‌లైన్‌లో ఉచితంగా నమోదు చేసుకోవచ్చు. నమోదైన క్రీడాకారులు ఈ నెల 21వ తేదీన ఉదయం 8 గంటల వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఒరిజినల్ కుల, 10వ తరగతి, జన్మదిన ధ్రువీకరణ పత్రాలతో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

సైనిక్ స్కూల్‌గా సాగర్ బీసీ గురుకులం!

● పూర్తయిన దరఖాస్తు పరిశీలన

నాగార్జునసాగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రం, ప్రముఖ విద్యా కేం ద్రంగా విరాజిల్లుతున్న నాగార్జునసాగర్ శిగలో మరో మణిహారం రాబోతుంది. 2026-27 విద్యా సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా 100 సైనిక్ పాఠశాలలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ గురుకులాలు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దరఖాస్తులు చేసుకోవాలని నిర్ణయించాయి. రాష్ట్రంలో సొంత భవనాలు ఉన్న 21 మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులాల్లో విశాలమైన భవన సముదాయం, క్రీడా మైదానం, ఖాళీ స్థలం ఉన్న నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్, మూసీ బీసీ గురుకుల పా ఠశాలలు సైనిక్ స్కూల్ ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకున్నాయి. దీంతో ఈ నెల 18వ తేదీన సైని క్ స్కూల్ ఏర్పాటు కమిటీ లీడర్, ఎయిర్ ఫోర్స్ అధికారి, కర్ణాటక రాష్ట్రంలోని



సాగర్ హిల్‌కాలనీలో ఉన్న బీసీ గురుకుల పాఠశాల

బీజాపూర్ సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ కెప్టెన్ రాజ్యలక్ష్మి పృథ్వీరాజ్ నేతృత్వంలో నల్లగొండ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ శ్రీనివాస్‌తో కలిసి దరఖాస్తులను పరిశీలించారు. సాగర్ బీసీ గురుకుల పాఠశాల దరఖాస్తు పరిశీలించిన అనంతరం ఈ బృందం సభ్యులు సంతృప్తిని వ్య క్తం చేశారు. అనంతరం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్‌తో సమావేశమయ్యారు. ఈ మేరకు నివేదికలు తయారు చేసి కేంద్ర రక్షణ శాఖ మంత్రిత్వ శాఖకు అందజేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. రాష్ట్రంలో 40 ఎకరాల సువిశాలమైన ప్రాంగణం కలిగి ఉన్న నాగార్జునసాగర్‌లో ఉన్న బీసీ గురుకుల పాఠశాలకు సైనిక్ స్కూల్ ఏర్పాటయ్యే అవకాశం ఉంది.

స్థానికుల హర్షం

సాగర్ హిల్‌కాలనీలో బీసీ గు రుకుల పాఠశాలలో సైనికల్ స్కూల్ ఏర్పాటు కాబోతుందన్న విషయం తెలుసుకున్న స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగర్‌లో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేస్తే సాగర్‌కు దేశంలో మరింతగా పేరు వస్తుందని స్థానికులు చెవుతున్నారు.

సాగర్ గురుకుల పాఠశాల ప్రస్థానం ఇది

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 1985లో తెలంగాణ ప్రాంతంలో సాగర్ హిల్‌కాలనీలో బీసీ గురుకుల పాఠశాల, ఏపీ వైపున బీసీ గురుకుల జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయడానికి శంకుస్థాపన చేశారు. ఏడాది కాలంలో భవన నిర్మాణాలు పూర్తి చేసుకొని 1986-87 విద్యాసంవత్సరంలో 6వ తరగతి నుంచి బీసీ గురుకుల పాఠశాలను ప్రారంభించారు. ప్రతి ఏడాది ఒక్కో తరగతిని పెంచుతూ పదోతరగతి వరకు ఏర్పాటు చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సర్వేల్ తర్వాత సాగర్ బీసీ గురుకుల పాఠశాలకు ప్రాముఖ్యత ఉంది. సాగర్ బీసీ గురుకులంలో విద్యనభ్యసించిన ప్రతి పదిమంది విద్యార్థుల్లో 8 మంది ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డవారే కావడం గమనార్హం. ఇంతటి గొప్ప పేరున్న బీసీ గురుకుల పాఠశాలలో చదివిన ఎందరో విద్యార్థులు విదేశాల్లో, స్వదేశంలో ఉన్నతాధికారులుగా స్థిర పడ్డారు. ప్రస్తుతం బీసీ గురుకులాల సెక్రటరీ సైదులు కూడా సాగర్ బీసీ గురుకుల పాఠశాలలో చదువుకున్న నాటి విద్యార్థి కావడం గమనార్హం.

దరఖాస్తు పరిశీలన పూర్తయింది



మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల వి ద్యాసంస్థల సెక్రటరీ సైదులు ఆదేశాల మేర కు సాగర్ బీసీ గురుకుల పాఠశాలలో సైనిక్ స్కూల్ ఏర్పాటు అనుమతుల కో సం జూలైలో దరఖాస్తు చేశాం. దరఖాస్తు పరిశీలన పూర్తయింది. దరఖాస్తును పరిశీలించిన అధికారులు సంతృప్తిని వ్యక్తం చేశారు. 40 ఎకరాల సువిశాలమైన క్రీడా మైదా నం, భవన సముదాయం ఉంది. సాగర్ బీసీ గురుకుల పాఠశాలకు సైనిక్ ఏర్పాటయ్యే అవకాశం ఉంది.

- రవికుమార్, బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, సాగర్

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

● ఏసీడీపీవో వెంకటమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీడీపీవో వెంకటమ్మ

చండూరురూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలన, శిశు విక్రయాలను అరికట్టడంలో పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఏసీడీపీవో వెంకటమ్మ అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాల్యవివాహాలు, శిశు విక్రయాలు, అక్రమ దత్తత చట్ట రీత్యా నేరమని అన్నారు. గ్రామాల్లో ఇలాంటి కార్యక్రమాలు జరగకుండా పంచాయతీ కార్యదర్శులు కూడా తమవంతు సహకారం అందించాలని కోరారు. ఎంపీడీవో బండారు యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆశ్రిత ఎన్జీవో సభ్యులు ధనమ్మ, శోభ, పీఆర్ ఏఈ హరిఉదయ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ, ఇన్‌చార్జి ఎంపీవో బి.సందీప్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు అన్యాయం చేసిన బీఆర్ఎస్

మర్రిగూడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం ముంపు గ్రామాల బాధితులకు పునరావాసం కల్పించటంలో నిర్లక్ష్యం చేసిందని సీపీఐ మండల ఇన్‌చార్జి కన్వీనర్ బుర్ర శేఖర్ అన్నారు. సీపీఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న చర్లగూడెం రిజర్వాయర్‌లో ముంపునకు గురైన గ్రామాల బాధిత భూ నిర్వాసితులకు సకాలంలో భూ నష్టపరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, పునరావాసం కల్పించడంలో విఫలమైందన్నారు. రిజర్వాయర్‌లో సర్వం కోల్పోయిన నిర్వాసితులకు కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి అర్హులైన వారికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించి వెంటనే పునరావాసం కల్పించాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఈదుల బిక్షంరెడ్డి, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీహెచ్ఎస్‌కు బెంచీల అందజేత



ఈదులూరు జడ్పీహెచ్ఎస్‌కు బెంచీలు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కట్టంగూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కట్టంగూరు జడ్పీ హైస్కూల్‌కు లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ ఆధ్వర్యంలో 12 డ్యూయల్ డెస్క్ బెంచ్‌లను బుధవారం అందజేశారు. లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యుడు బండారు హరినాథ్ సతీమణి యోగమాల స్మారకార్థం నిమ్మల పిచ్చయ్యల సహకారంతో ఈ బెంచ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ కేవీ ప్రసాద్, ఆర్‌సీ మిర్యాల యాదగిరి, బండారు రామలింగం, చిలుకూరి రామకృష్ణ, అశోక్, సాయికుమార్, కృష్ణయ్య, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ఆంథోని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యసనాలతో అంధకారం : సీఐ

శాలిగౌరారం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడితే తమ విలువైన జీవితాలు అంధకారంలో మగ్గుతాయని నల్లగొండ షీటీం సీఐ కోట కరుణాకర్ అన్నారు. శాలిగౌరారం మండలం వల్లాలలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో పోక్సో చట్టం, సైబర్ క్రైం, మానవ అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల నిర్మూలన గురించి సీఐ కోట కరుణాకర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. భరోసా టీం గురించి నళిని వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో 100 వినియోగం మహిళలను యువతులను వేధించే వారితో అప్రమత్తంగా ఉండి షీ టీంను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గౌస్, విజయలక్ష్మి, ఏఎస్ఐ షీటీం, హెడ్ కానిస్టేబుల్ నర్సింహ, పోలీస్ కళాబృందం హుస్సేన్ అండ్‌టీం, హెచ్ఎం కృష్ణమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుమ్మరి వాములను కూల్చవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడుకొండల వెంకటేశం

కనగల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగట్టె గ్రామంలో కుమ్మరివాములను కూల్చి కుమ్మరి వృత్తిదారులకు అన్యాయం చేయవద్దని టీఆర్‌కేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏడుకొండల వెంకటేశం అన్నారు. టీఆర్‌కేఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం రేగట్టె గ్రామ శివారులోని కుమ్మరి వాములను ఆయన పరిశీలించారు. వృత్తిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ భవన నిర్మాణం కోసం ఏళ్ల తరబడి కొనసాగుతున్న కుమ్మ వాము స్థలాన్ని లాక్కునే కుట్ర జరుగుతుందని ఆరోపించారు. అంగన్‌వాడీ భవన నిర్మాణానికి మరోచోట స్థలాన్ని కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కుమ్మరి వృత్తిదారులకు అన్యాయం జరిగితే ఆందోళనలు తప్పవని వెంకటేశం హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బిక్షపతి, జి.వెంకటేశ్వర్లు, చంద్రం, బాలనర్సయ్య, హరి, నిమ్మల గోటి శ్యాంప్రసాద్, సిలివేరు సత్తయ్య, బొడ్డుపల్లి శ్రీనివాస్, కొండయ్య, శేఖర్, మల్లిఖార్జున్, శ్రీనివాసు పాల్గొన్నారు.

ఆస్పత్రికి సమస్యల సుస్తీ

● అరకొర సిబ్బంది ● సౌకర్యాల కల్పనలో విఫలం
● పెచ్చులూడిపోతున్న స్లాబ్ ● విధులు నిర్వహించడానికి జంకుతున్న సిబ్బంది
● ఇదీ చిట్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దుస్థితి





చిట్యాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, వార్డులో పెచ్చులూడిన స్లాబ్

చిట్యాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చిట్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమస్యల సుస్తీ చేసింది. రోగులకు చికిత్స చేయాల్సిన ఆస్పత్రిలో మౌలిక వసతులు లేకపోవడంతో రోగులు, వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. మండల కేంద్రమైన చిట్యాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సుమారు 20ఏళ్ల క్రితం నిర్మించారు. ప్రస్తుతం ఆస్పత్రి శ్లాబ్ సిమెంట్ పోయి సీకులు తేలింది. మరీ ముఖ్యంగా ఇన్‌పేషెంట్ వార్డు మొత్తం శిథిలావస్థకు చేరుకుంది. ఆస్పత్రిలో విధులు నిర్వహించడానికి సిబ్బంది జంకుతున్నారు. ఇటీవల డాక్టర్ ఓపీ విధులు నిర్వహిస్తుండగా సిమెంట్ పెచ్చులు ఊడిపడ్డాయి. వర్షం వచ్చినప్పుడు నీరు కారుతున్న శ్లాబ్ ఎప్పుడు కూలుతుందో అని రోగులు, ఆస్పత్రి సిబ్బంది జంకుతున్నారు. ఇక ఆస్పత్రిలోని బోరు మోటారు చెడిపోవడంతో సుమారు 20రోజుల నుంచి ఆసుపత్రిలో నీటి సరఫరా నిలిచిపోయింది. రోగులు, సిబ్బంది మూత్రశాలకు, మరుగుదొడ్డికి వెళ్లడానికి నీటి కరువు ఏర్పడింది.

సిబ్బంది కొరత...

మౌలిక వసతులు సరిగా లేకపోవడం ఒక సమస్య అయితే ఆస్పత్రిని సిబ్బంది కొరత కూడా వేధిస్తోంది. ముఖ్యంగా ఫార్మాసిస్టు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. స్టాఫ్‌నర్సు పోస్టు కూడా ఖాళీగా ఉంది. ఆస్పత్రికి నూతన భవనం నిర్మించాలని, రోగులకు అన్ని వసతులు కల్పించాలని, ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మండల జనాభా ఇలా..

చిట్యాల మండలంలో 15గ్రామ పంచాయతీలు ఉండగా 55,600జనాభా ఉంది. చిట్యాల మునిసిపాలిటీలో 14,986 జనాభా ఉంది. ఇది కాకుండా వివిధ అవసరాల నిమిత్తం 2000మంది మండల కేంద్రానికి వచ్చి వెళుతుంటారు. ఇంతటి ప్రాంధాన్యం ఉన్న చిట్యాల పట్టణంలో పీహెచ్‌సీలో అన్ని సౌకర్యాలు ఉండాల్సి అవసరం ఉంది.

నూతన భవనం నిర్మించాలి



చిట్యాల మునిసిపాలిటీగా రూపాంతరం చెందినా పీహెచ్‌సీ అభివృద్ధికి నోచుకోలేదు. రోగులకు, వైద్య సిబ్బందికి మౌలిక వసతులు కల్పించాలి. ఆస్పత్రికి నూతన భవనం నిర్మించడంతో పాటు అన్ని వసతులు కల్పించాలి. పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలి. ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయాలి.

-కూనూరు సంజయ్‌దాస్, చిట్యాల

భయపడుతూ విధులు నిర్వహిస్తున్నాం



ఆస్పత్రిలో భయపడుతూ విధులు నిర్వహిస్తున్నాం. ఆస్పత్రి భవనం వర్షం వచ్చినప్పుడల్లా కురుస్తోంది. శ్లాబ్ పెచ్చులు ఊడి మీదపడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని భయాందోళన ఉంది. నీటి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నాం. భవనానికి మరమ్మతులు చేపట్టాలి.

- సత్యనరేష్, పీహెచ్‌సీ, వైద్యాధికారి, చిట్యాల

నేడు ఊట్కూరులో వైద్యశిబిరం

శాలిగౌరారం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం ఊట్కూరు గ్రామంలో గురువారం లయన్స్ క్లబ్ నల్లగొండ, లయన్స్ క్లబ్ శాలిగౌరారం ఆధ్వర్యంలో హైదరాబాద్ యశోద హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య మెగా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు శాలిగౌరారం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గుజిలాల్ శేఖర్‌బాబు తెలిపారు. ఈ వైద్యశిబిరంలో గుండె వ్యాధి, జనరల్ వ్యాధులు, కంటి, ఎముకల, స్త్రీల వైద్య నిపుణులు పాల్గొని పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉచితంగా మందులు కూడా ఇస్తారని తెలిపారు. డయాబెటిక్ స్క్రీనింగ్, డెంటల్ అవేర్నెస్ క్యాంపు ఉంటుందని తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని శేఖర్ బాబు తెలిపారు.

మాలధారులకు భిక్ష

మునుగోడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మునుగోడు అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం మండల కాంగ్రెస్ నాయకుడు ముచ్చపోతుల శ్రీనివాస్- గీతమ్మ దంపతుల ఆధ్వర్యంలో అయ్యప్ప, హనుమాన్, శివస్వామి మాలధారులకు అన్నదానం (భిక్ష) కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. తీర్థప్రసాదాల వితరణ అనంతరం చేపట్టిన భిక్ష కార్యక్రమంలో మండల పరిసర గ్రామాల నుంచి మాలధారులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన బీఆర్ఎస్

● ఎమ్మెల్యే వేముల వీరేశం



మెటల్ రోడ్డుకు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

కట్టంగూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పదేళ్ల పాలన రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. రాజ్యసభ సభ్యుడు విజయేంద్రప్రసాద్ నిధులు రూ.50లక్షలతో మండలంలోని ఈదులూరు నుంచి కురుమర్తి వరకు నిర్మించనున్న మెటల్ రోడ్డు పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. అభివృద్ధి పేరిట గత ప్రభుత్వం అవినీతికి పాల్పడిందన్నారు. పదేళ్ల పాలనలో సుమారు రూ.8లక్షల కోట్ల అప్పు చేసిందని ఆరోపించారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేదలకు సన్నబియ్యం ఇస్తున్నామని, ఇందిరమ్మ పథకంతో సొంతింటి కల నెరవేరుస్తున్నామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆడబిడ్డలను ఆర్థికంగా బలోపేతం చేసే కార్యక్రమాలను తమ ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. సుమారు రూ.200 కోట్లతో నియోజకవర్గానికో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయంలో 57 మంది లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి, 29 మంది బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు.

ఆయా కార్యక్రమాల్లో వల్లూరిపల్లి రాధమ్మ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుబ్బయ్య, మాజీ జడ్పీటీసీలు మాద యాదగిరి, సుంకరబోయిన నర్సింహ, కొండ లింగస్వామి, అయితగోని నారాయణ, బూరుగు శ్రీను, గద్దపాడు రాములు, మిట్టపల్లి శివశంకర్, చింత వెంకటనర్సయ్య, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు, పులిగిల్ల అంజయ్య, అనిల్‌రెడ్డి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేయాలి



ఈదులూరులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న మత్స్య సహకార సంఘం సభ్యులు

కట్టంగూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని, బడ్జెట్‌లో రూ.5వేల కోట్లు కేటాయించాలని తెలంగాణ మత్స్యకార కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురారి మోహన్ డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించే తెలంగాణ మత్స్యకార కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మండలంలోని ఈదులూరులో బుధవారం మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రియల్ ఎస్టేట్ మాఫియా కారణంగా కనుమరుగవుతున్న జలవనరులను కాపాడి మత్స్యకారులకు ఉపాధిగా మార్చాలని అన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం నిర్వహించే ఈ మహాసభలకు మత్స్యకారులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తవిడబోయిన అజయ్‌కుమార్, సభ్యులు నీలం రాములు, గుండు అంజయ్య, తవిడబోయిన వెంకయయ, నీలం శివ, పొన్నెబోయిన రామకృష్ణ, నార్ల రవి, హనుమంతు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దాత సహకారంతో కిచెన్ షెడ్ ఏర్పాటు

నార్కట్‌పల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప రాధారపు యాదగిరి సౌజన్యంతో కిచెన్ షెడ్ ఏర్పాటు చేయనున్నారు. అయ్యప్ప దీక్ష చేపట్టిన స్వాములు అయ్యప్ప ఆలయంలోనే భిక్ష, అల్పాహారం చేస్తుండటంతో వంట చేసేందుకు స్థలం ఇరుకుగా మారింది. దీంతో యాదగిరి సహకారంతో సుమారు రూ.30వేల ఆర్థిక సహకారంతో కిచెన్ షెడ్ వేసేందుకు ముందుకు రాగా గురుస్వామి బెల్లి వెంకన్న దాత యాదగిరిని ఆశీర్వదించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పుల్లెంల శ్రీనివాస్, గడ్డం శివరాం, రాపర్తి మోహన్ పాల్గొన్నారు.

ఝాన్సీలక్ష్మీబాయిని స్ఫూర్తిగా తీసుకోవాలి



ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు

చిట్యాల, నవంబరు19, (ఆంధ్రజ్యోతి): నేటి మహిళలు ఝాన్సీ లక్ష్మీబాయి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు పోవాలని ఏబీవీపీ పట్టణ కార్యదర్శి కొంపెల్లి సూర్య తెలిపారు. చిట్యాలలో స్త్రీశక్తి దివాస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఝాన్సీ లక్ష్మీబాయి ధైర్య సాహసాలు నేటి మహిళలకు ఆదర్శమన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో లక్ష్మీబాయి ప్రముఖపాత్ర పోషించిందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు గణేష్, యశ్వంత్, ఫణీంద్ర, శశి, కావ్య, మాధురి తదితరులు పాల్గొన్నారు.

మేమింతే..

(5వ పేజీ తరువాయి)

మల్చుకుంటున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వారు ఆడిందే ఆట పాడిందే పాటగా మారిపోతుంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ల రైటర్లను అనుమతించేందుకు ఎక్కడ కూడా ప్రభుత్వం నుంచి అనుమతి లేదు. ఒక్కో డాక్యుమెంట్ రైటర్ వద్ద నలుగురి నుంచి ఐదుగురి వరకు పని చేస్తూ వారంతా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తిరుగుతుండటంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. డాక్యుమెంట్ తయారు చేయడంకోసం తప్పనిసరి పరిస్థితుల్లో ఆస్తుల క్రయవిక్రయదారులతో పాటు ప్రతిఒక్కరూ డాక్యుమెంట్ రైటర్‌పై ధారపడాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ చివరకు సబ్ రిజిస్ట్రార్‌తోపాటు ఆయా కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు సైతం డాక్యుమెంటరీ రైటర్లపైనే ఆధారపడటం కనిపిస్తుంది.

ఐజీ అనుమతి లేని డిప్యూటేషన్

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో గతంలో పనిచేసిన ఓ ఉన్నతాధికారి తమకు సన్నిహితంగా ఉన్న ఓ ఉద్యోగిని బదిలీ చేసిన 12 గంటల్లోపే తిరిగి డిప్యూటేషన్‌పై జిల్లా కార్యాలయానికి తీసుకరావడం వివాదస్పందంగా మారింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ అనుమతి లేకుండానే సదరు ఉద్యోగిని డిప్యూటేషన్‌పై తీసుకోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. నల్లగొండ జిల్లాలోని ఓ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రెగ్యూలర్ చేసి పంపిన వెంటనే ఆ ఉద్యోగిని అక్కడ రిలీవింగ్ చేయించుకొని మధ్యాహ్నంలోగానే తిరిగి నల్లగొండ ఉమ్మడి నల్లగొండ జిల్లాలోకి తీసుకురావడం గమనార్హం. సదరు ఉద్యోగి వచ్చి రెండేళ్లు కాకముందే సీనియర్లను కాదని అని సెక్షన్‌లను తన గుప్పిట్లో పెట్టుకొని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం సొసైటీల రిజిస్ట్రేషన్ వివాదాలు తనకు చుట్టుకోవడంతో రిలీవ్ చేయమని తానే స్వయంగా ఉన్నతాధికారులను కోరుకున్నట్లు తెలిసింది. అయితే ఆ వివాదం తగ్గగానే మళ్లీ జిల్లా కార్యాలయం నుంచి తనను మార్చకుండా ఉండేందుకు రాజకీయ నేతల నుంచి ఒత్తిళ్లు చేస్తున్నట్లు సమాచారం.

ఒక్కో సొసైటీ నుంచి రూ.1500

కొత్త సొసైటీల ఫైళ్లకోసం ఒక్కో సొసైటీ నుంచి రూ.1000 నుంచి రూ.1500, చిట్స్ ఆర్బిటేషన్‌కు సంబంధించి ఒక్కో కేసుకు రూ.3వేల నుంచి రూ.5వేలు వసూలు చేయడం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన తప్పులను సరిదిద్దడానికి (కార్డు) సంబంధించి రూ.1000నుంచి రూ.2000ను ఒక్కో ఫైల్‌కు వసూలు చేస్తున్నట్లు సర్వత్రా చర్చ సాగుతుంది. గత కొన్ని నెలల క్రితం అప్పట్లో ఓ ఇన్‌చార్జి అధికారి సమయంలో సదరు ఈ ఉద్యోగి సూర్యాపేట జిల్లాలోని ఓ నియోజకవర్గానికి చెందిన ఎడ్యుకేషన్ సొసైటీ విషయంలో జోక్యం చేసుకొని ఇరువర్గాల మధ్య గొడవలు పెట్టడమే కాకుండా ఇతర వ్యక్తులనుంచి పెద్ద ఎత్తున ముడుపులు తీసుకున్నట్లు తెలిసింది. కోర్టుల్లో కేసులు ఉన్నా సొసైటీల మధ్య గొడవలు జరిగే విధంగా సదరు అక్రమ డిప్యూటేషన్ ఉద్యోగి వ్యవహరిస్తున్నట్లు వినికిడి. కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలకు సంబంధించి ఆంధ్రజ్యోతి ఉమ్మడిజిల్లా రిజిస్ట్రార్ రవీందర్‌రావును వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించినప్పటికీ ఆయన ఫోన్ లిఫ్ట చేయలేదు

రామానుజన్ టాలెంట్ టెస్ట్‌లో

సాందీప్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన సాందీప్ హైస్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

నల్లగొండ టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన రామానుజన్ టాలెంట్ టెస్ట్‌లో పట్టణంలోని సాందీప్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. పాఠశాలకు చెందిన 16 మంది విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రెండో దశకు ఎంపికయ్యారు. వారిలో కె.అవినాశ్, కె. అక్షిత్‌గౌడ్, ఎ.ప్రణీత్‌కుమార్, ఎస్‌కే. ఆఫియా సుల్తానా, పి. పూర్ణశ్రీ, గంజి హర్ష, వి.యశ్వంత్, షేక్ అలీమా సాదియా, పి.నిత్యశ్రీ, టి.భార్గవి, ఎ.నవదీప్, కె.వరుణ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వారిని పాఠశాల కరస్పాండెంట్ సత్యనారాయణరెడ్డి అభినందించారు. పాఠశాలలో సాంకేతిక విద్యతో కూడిన సృజనాత్మక నైపుణ్యాలతో ఉత్తమ బోధన అందిస్తున్నందుకు ఈ ఫలితాలు నిదర్శనమని అన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

నల్లగొండ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే గ్రామ పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం జిల్లా చీఫ్ కో-ఆర్డినేటర్ నేలపట్ల చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లకు చట్టబద్ధత చేయకుండా ఎన్నికలకు వెళ్లాలనుకోవడం బీసీలను మోసం చేయడమేనని తెలిపారు. అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి, అన్ని పార్టీ నాయకులతో కలిసి ప్రధాన మంత్రితో భేటీకి అనుమతిని పొందాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే బీసీ రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం కృషి చేయాలని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఆశయ సాధన కోసం కృషి చేయాలి

శాలిగౌరారం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మండలకేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ఆయన హాజరై ఇందిరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, భూమి లేని నిరుపేదలకు భూములు పంచిందని అన్నారు. నిరుపేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చండూరులో ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

● చిట్యాలలో ఇందిరాగాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశాభివృద్ధికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నాయకులు పోకల దేవదాస్, చినమల్లయ్య, పరమేశం పాల్గొన్నారు.

● మర్రిగూడలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు రమావత్ భీమానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన వ్యక్తి ఇందిరాగాంధీ అని అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య, శ్రీశైలం మాజీ సర్పంచులు మాస నీలిమా చంద్రశేఖర్, నక్క తిరుపతయ్య, బండి హనుమంతు, అజిత్‌రెడ్డి, వెంకటయ్య, నరసింహారెడ్డి, జంగయ్య, అల్వాల్ రెడ్డి, బంగారం తదితరులు పాల్గొన్నారు.



శాలిగౌరారంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేలు

● చండూరులో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చండూరు మునిసిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ దోటి సుజాతవెంకటేష్‌యాదవ్, నాయకులు నల్లగంటి మల్లేశం, మంచుకొండ సంజయ్, కారింగు రామ్మూర్తి, కల్లెట్ల మారయ్య, లింగయ్య, జనార్దన్, దశరథ, వెంకటేశం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, చిత్రంలో గ్రంథాలయ చైర్మన్ ఎం. హఫీజ్ ఖాన్

ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 27.5
కనిష్ఠం 15.4
***
ANDHRAJYOTHY
నల్లగొండ
5
గురువారం 20 నవంబరు 2025

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	585.50 (298.8775)	నిల్	14,760
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.20 (4.25)	1,031.82	723.02
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.095 (42.886)	1,000	8,000

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.152 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260



మేమింతే!

- ప్రతీ డాక్యుమెంట్‌కు ఓ రేటు
- అక్రమ రిజిస్ట్రేషన్‌లకు అదనపు ముడుపులు
- కొన్ని చోట్ల డాక్యుమెంట్ రైటర్లే షాడో ఎస్ఆర్‌వోలు
- ఏసీబీ దాడులు జరుగుతున్న మారని తీరు



స్టాంపులు, రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అవినీతి అక్రమాలకు అడ్డులేదన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. అడపాదడప ఏసీబీ దాడులు జరుపుతున్నా కొందరూ అధికారుల్లో మార్పు రావడం లేదన్న విమర్శలున్నాయి. ఇటీవల మిర్యాలగూడలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన అవినీతి తంతంగం చూస్తుంటే యథేచ్ఛగా అక్రమాల దందా కొనసాగుతుందన్న ఆరోపణలున్నాయి.

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

ఇటీవల ఏసీబీ అధికారుల తనిఖీలో మిర్యాలగూడ సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలకు అంతేలేకుండా పోతుందనేది వెలుగులోకి వచ్చింది. ప్రధానంగా డాక్యుమెంట్ రైటర్లు, వారి అనుచరులు ఆ కార్యాలయంలో రాజ్యమేలుతున్నారనేది బయటపడింది. ఈ విధానం సంవత్సరాల తరబడి సాగుతున్నప్పటికీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వారు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భువనగిరి, బీబీనగర్, చండూరు, చౌటుప్పల్, దేవరకొండ, హుజూర్‌నగర్, కోదాడ, మిర్యాలగూడ, మోత్కూరు, నకిరేకల్, నల్లగొండ, నిడమనూరు, రామన్నపేట, సూర్యాపేట, యాదగిరి గుట్ట సబ్ రిజిస్ట్రార్‌లు ఉన్నాయి. ఇందులో పలు కార్యాలయాల్లో పలు కార్యాలయాలల్లో డాక్యుమెంట్ రైటర్లు ఏకంగా షాడో సబ్ రిజిస్ట్రార్‌లుగా వ్యవహరిస్తూ పనులను చక్కబెట్టుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వాస్తవానికి డాక్యుమెంట్ రైటర్లు కార్యాలయంలోకి వెళ్లకుండా బయటి నుంచే ఆయా కౌంటర్ల ద్వారా డాక్యుమెంట్లు అందించాల్సి ఉన్నప్పటికీ ఏకంగా కార్యాలయంలోని కంప్యూటర్ రూమ్‌లోకి వెళ్లి అనేక పనులు చేసుకోవడంతో పాటు పెత్తనం చెలాయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక కొన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని సీనియర్ డాక్యుమెంట్ రైటర్లు సబ్ రిజిస్ట్రార్‌లను సైతం బ్లాక్‌మెయిల్ చేస్తూ తమ అక్రమ డాక్యుమెంట్లను చక్కబెట్టుకున్నట్లు చర్చ సాగుతోంది. కొందరూ సబ్ రిజిస్ట్రార్‌లు ఏకంగా సీనియర్ డాక్యుమెంట్ రైటర్లు ఏమి చెబితే ఆ పని చేసి పెడుతుండటం గమనార్హం. అదేవిధంగా లేఅవుట్‌లు లేకుండా, ఎల్ఆర్ఎస్ లేకుండా కూడా కొంతమంది సబ్‌రిజిస్ట్రార్‌లు రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

కొన్నిచోట్ల ఎల్ఆర్ఎస్ లేకపోతే గజానికి రూ.100 చొప్పున రేటు కట్టి ఆయా ప్లాట్‌లకు రిజిస్ట్రేషన్ చేస్తుండటంతో ప్రభుత్వ ఖజానాకు గండి పడటం ఆయా ఎస్ఆర్‌వోలకు అదనపు ఆదాయం సమకూరడం జరుగుతుంది. ఇకపోతే నల్లగొండ జిల్లాలో ఒక సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, సూర్యాపేట జిల్లాలో ఒక సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఒక సబ్ రిజిస్ట్రార్‌లో సీనియర్ అసిస్టెంట్‌లే ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌లుగా వ్యవహరిస్తున్నారు. ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలల్లో ఎప్పుడు పూర్తిస్థాయిలో సబ్ రిజిస్ట్రార్‌లను నియమిస్తారనేది స్పష్టత లేదు.

ఉమ్మడి కార్యాలయంలో..

ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇన్‌చార్జి అధికారులు ఉన్నప్పుడు కొందరూ సబ్ రిజిస్ట్రార్‌లతో డాక్యుమెంట్ రైటర్లు మరింతగా ఆ అవకాశాన్ని తమకు అనుకూలంగా

మిగతా 8వ పేజీలో

ముడుపులు పుచ్చుకుంటూ..

ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒక్కో డాక్యుమెంట్‌కు ఓ రేటు పెట్టగా అక్రమ డాక్యుమెంట్లకు అదనపు ముడుపులు పుచ్చుకుంటూ ఫైళ్లను కదిలిస్తున్నారు. కాసులు ఇస్తే అక్రమ డాక్యుమెంట్లు సైతం సక్రమంగా మారడం, లేదంటే సక్రమంగా ఉన్న డాక్యుమెంట్లను అనేక తిరకాసులు పెట్టి తిప్పడం పరిపాటిగా మారింది. చాలామంది డాక్యుమెంట్ల రైటర్ల ద్వారానే తంతంగం అంతా నడిపిస్తున్నట్లు ఇటీవల మిర్యాలగూడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు గుర్తించారు. వాస్తవానికి ఆస్తుల క్రయ విక్రయదారులు, సాక్ష్యులు మాత్రమే అడుగుపెట్టాల్సి ఉండగా డాక్యుమెంట్ల రైటర్లు కార్యాలయంలో పెత్తనం చేస్తున్నట్లు వినికిడి. ఒక్కో డాక్యుమెంట్‌కు రూ.500 నుంచి రూ.1000 వసూలు చేస్తుండగా ఈసీలకు, సీసీలకు రూ.300 నుంచి రూ.400, మ్యారేజీ సర్టిఫికేట్లకు రూ.1000 నుంచి రూ.1500 వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. డబ్బులు ఇవ్వని డాక్యుమెంట్లను పెండింగ్‌లో పెట్టడం పరిపాటి.

మత్స్యకారుల ఆర్థిక పరిపుష్టికి కృషి

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు



శాలిగౌరారం ప్రాజెక్టులో చేప పిల్లలను వదులుతున్న సామేలు

శాలిగౌరారం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులను అన్ని విధాలుగా ఆదుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. శాలిగౌరారం ప్రాజెక్టులో ఉచిత చేప పిల్లలను వదిలే కార్యక్రమాన్ని బుధవారం ఎమ్మెల్యే మందుల సామేలు ప్రారంభించి మాట్లాడారు. మత్స్యకారుల ఆర్థిక పరిపుష్టి కోసం ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని చెరువులు, ప్రాజెక్టుల్లో ఉచితంగా చేప పిల్లలను పెంచడానికి రూ.80కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. జిల్లా మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రాజారాం మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో 11 వందల చెరువుల్లో 5 కోట్ల 98 లక్షల చేప పిల్లలను పెంచేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. జిల్లాలో అన్ని చెరువుల్లో చేప పిల్లలను పోసే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. శాలిగౌరారం ప్రాజెక్టులో 8 లక్షల చేప పిల్లలను మత్యసంఘం ఆధ్వర్యంలో వదిలినట్లు వెల్లడించారు. మత్స్యకారులు చేపలను బాగా పెంచుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ సహకార సంఘం అధ్యక్షుడు కనుక వెంకటనారాయణ, డైరెక్టర్ చెన్నబోయిన వీరయ్య, జిల్లా మత్స్యశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ వి. శ్రీనివాస్, శాలిగౌరారం మార్కెట్ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నరిగే నర్సింహ, తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో జ్యోతిలక్ష్మి, ఏవో సౌమ్యశృతి, మత్యశాఖ ఫీల్డ్ ఆఫీసర్ ప్రియాంక, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, సాదుల నర్సయ్య, చాడ సురేష్‌రెడ్డి, గంధసిరి వెంకన్న, సైదులు, యాదగిరి, రమేష్, సత్తయ్య, వెంకట రమణారెడ్డి, కొమరయ్యగౌడ్ పాల్గొన్నారు.

వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

నల్లగొండ(కలెక్టరేట్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందని జిల్లా రెవెన్యూ అధికారి అశోక్‌రెడ్డి అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో ఈ నెల 12 నుంచి 19 వరకు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చివరి రోజైన బుధవారం జిల్లా స్థాయి సమావేశాన్ని కలెక్టరేట్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో వయోవృద్ధుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామన్నారు. ఆసరా పింఛన్‌తో పాటు మెరుగైన జీవనశైలి కోసం, సౌకర్యాలు కల్పించడం కోసం ప్రభుత్వం అన్నిశాఖల సమన్వయంతో పని చేస్తోందన్నారు. వయోవృద్ధుల కోసం ఉచిత ఆశ్రమం స్థల కేటాయింపు జరిగిందన్నారు. ఈ సందర్భంగా విశిష్ట సేవలు అందించిన వయోవృద్ధులకు సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సముద్రాల మల్లికార్జున్, కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ నాయకులు, అదనపు వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి, మహిళా శిశు, వయోవృద్ధుల శాఖ ఫీల్డ్ ఆఫీసర్ మునగాల నాగిరెడ్డి, శ్రీకాంత్, సునీల్, సిబ్బంది వెంకట్‌రెడ్డి, బాలయ్య, సునీత పాల్గొన్నారు.

సారె, చీర పెట్టడం తెలంగాణ సంప్రదాయం

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



సీఎంతో వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఇతర శాఖల అధికారులు

నల్లగొండ(కలెక్టరేట్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆడబిడ్డలకు చీర, సారె పెట్టడం తెలంగాణ సంప్రదాయమని, అందులో భాగంగా ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణారావులతో కలిసి బుధవారం ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరల పంపిణీని ప్రారంభించుకున్నామన్నారు. ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రక్రియకు సంబంధించి ప్రతీ నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని ఆదేశించారు. నియోజకవర్గాల్లోని అన్ని మండల కేంద్రాల్లో విడతల వారీగా ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టాలన్నారు. పండగ వాతావరణంలో ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టాలన్నారు. మహిళల ఉన్నతి- తెలంగాణ ప్రగతి - ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం పేరుతో ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్లాలన్నారు. ప్రతి ఒక్కరికీ చీరల పంపిణీ సమాచారాన్ని అందించాలన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాలకు ఇప్పటివరకు రూ.27 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని, ఉచిత బస్సు సౌకర్యం కల్పించడమే కాకుండా మహిళలే బస్సులను నిర్వహించుకునేలా ఇందిరా మహిళా శక్తి పేరుపై మహిళా సంఘాలకు బస్సులు ఏర్పాటు చేశామన్నారు. స్కూల్స్‌లో యూనిఫారం కుట్టే బాధ్యత మహిళా సంఘాలకే అప్పగించామని దీని ద్వారా వారికి రూ.30 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. రూ.554 కోట్ల విలువ చేసే అమ్మ ఆదర్శ పాఠశాల పనులను మహిళా సంఘాలకు అప్పగించామని, మహిళా సంఘాలకు పెట్రోల్ పంపులు, సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేసి వారిని ఆర్థికంగా నిలబెట్టేలా చేశామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరలు అందేలా కలెక్టర్లు పారదర్శకంగా పంపిణీ చేయించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బుధవారం నుంచి డిసెంబరు 9 వరకు ఇందిరమ్మ చీరల పంపిణీ ఉంటుందని, మార్చి 1 నుంచి 8 వరకు పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ చీరల పంపిణీ ఉంటుందన్నారు. వివాదాలకు తావు లేకుండా చీరల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యర్, సెక్రటరీ దేవసేన తదితరులు మాట్లాడారు. వీడియోకాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. జిల్లా నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, ఇతర జిల్లా అధికారులు, జిల్లా సమాఖ్య బాధ్యులు, సహాయక మహిళా సంఘాల అధ్యక్షులు హాజరయ్యారు.

23న పంచాయతీ ఎన్నికల ఓటర్ల జాబితా పునః ప్రచురణ



నల్లగొండ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వచ్చేనెలలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తుండగా, రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు మొదలు పెట్టింది. ఇందు కోసం బుధవారం ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. నవంబరు 20న కొత్త ఓటర్ల నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తారు. అదేరోజున ప్రచురించిన ఓటర్ల జాబితాలో సవరణలు, ఇతర మార్పులు, చేర్పులను, పోలింగ్ స్టేషన్లు, లొకేషన్ల మార్పులను ఎన్నికల అధికారులు సమోటోగా నిర్వహిస్తారు. 22న ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలు, వినతులను జిల్లా పంచాయతీ అధికారులు పరిష్కరిస్తారు. 23న తుది పునః ప్రచురణకు సిద్ధం చేసిన ఫొటోలతో సహా ఓటర్ల జాబితాలను డీపీవోల వద్ద ప్రదర్శిస్తారు. 23న పోలింగ్ స్టేషన్ల వారీగా మార్పులతో కూడిన ఓటర్ల జబితాలు ప్రదర్శిస్తారు. ఇదిలా ఉండగా సాధారణ పరిశీలకురాలిగా క్రొర లక్ష్మి, వ్యయ పరిశీలకునిగా వెంకట ఆదిత్య నియమితులయ్యారు.


42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా చైర్మన్ మునాస ప్రసన్నకుమార్

నల్లగొండ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ మునాస ప్రసన్నకుమార్ అన్నారు. బీసీ జేఏసీ జిల్లా కమిటీని బుధవారం నల్లగొండలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్ మునాస ప్రసన్నకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ కమిటీ సభ్యులందరూ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే పోరాటంలో తమవంతు బాధ్యతగా పాల్గొనాలన్నారు. రిజర్వేషన్ల సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా 42శాతం రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధంగా కల్పించిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లాలోని వివిధ కులసంఘాల అధ్యక్షులు, వివిధ బీసీ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు. అంతకు ముందు జిల్లా బీసీ యూత్ జేఏసీ చైర్మన్‌గా కట్టికోలు దీపేందర్, బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్‌గా అయితగోని జనార్దన్‌గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం బీసీ జేఏసీ కమిటీని జేఏసీ చైర్మన్ మునాసు ప్రసన్నకుమార్ నియమించారు. గౌరవ సలహాదారులుగా చీర పంకజ్‌యాదవ్, గౌరవాధ్యక్షులుగా సుంకరి మల్లేష్‌గౌడ్, గుంటోజు వెంకటాచారి, చిలకరాజు చెన్నయ్య, పర్వతాలు, జిల్లా వర్కింగ్ చైర్మన్‌గా మిర్యాల యాదగిరి, ప్రధానకార్యదర్శిగా గజ్జి అజయ్ కుమార్ యాదవ్, కోఆర్డినేటర్‌గా చెన్నూరి భరద్వాజయాదవ్, సంయుక్త కార్యదర్శులుగా గడగోజు విజయ్, అనంతుల నాగరాజ్‌గౌడ్, కన్వీనర్లుగా పాల్వాయి రవి, కర్నాటి యాదగిరి, తలారి యాదగిరి, కోకన్వీనర్లుగా ఏరుకొండ హరి, పగిళ్ల సైదులు, వైస్ చైర్మన్‌లుగా వడ్డెబోయిన రామకృష్ణ, చిలకరాజు సతీష్, మార్గం సతీష్, పొగాకు నాగరాజు, పట్టణ అధ్యక్షుడిగా పుట్ట వెంకన్నగౌడ్, ఉపాధ్యక్షుడిగా చెన్నోజు రాజు, యూత్ జేఏసీ పట్టణ అధ్యక్షుడిగా మల్లెబోయిన సతీష్‌యాదవ్, మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఖదీర్‌లను నియమించారు.

సీపీఐ బస్సుయాత్ర



7

గట్టుప్పల్‌లో మాట్లాడుతున్న నెల్లికంటి సత్యం

సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర బుధవారం జిల్లాలో కొనసాగింది. ఈ నెల 15న గద్వాల నుంచి ప్రారంభమైన యాత్ర బుధవారం జిల్లాకు చేరింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పాల్గొని నాయకులకు స్వాగతం పలికారు.

నేడు చెర్వుగట్టులో గిరిప్రదక్షిణ

- విస్తృత ప్రచారం చేసిన వీహెచ్‌పీ
- భక్తులు భారీగా పాల్గొనే అవకాశం

నార్కట్‌పల్లి, నవంబరు 19,(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం వద్ద ప్రారంభించిన గిరిప్రదక్షిణ నేడు రెండో పర్యాయం జరగనుంది. ధర్మ ప్రచార సంపర్క్ ప్రముఖ్ ఉంద్యాల ప్రకాష్‌రెడ్డి నేతృత్వంలో గత నెల అమావాస్య రోజున ప్రారంభించిన చెర్వుగట్టు గిరి ప్రదక్షిణ రెండో నెల ఈ నెల 20వ తేదీన కొనసాగనుంది. ఆలయాల ప్రాశస్త్యాన్ని ప్రచారం చేయాలని సంకల్పించి గిరిప్రదక్షిణకు భక్తుల నుంచి మొదటిసారి మంచి స్పందన లభించింది. గుట్ట కింద రాజగోపురం మెట్లమార్గం వద్ద ప్రారంభించి నంది సర్కిల్ ద్వారా నల్లచెర్వు కట్ట నుంచి ఎల్లారెడ్డిగూడెం మీదుగా తిరిగి ఘాట్ రోడ్డు మీదుగా గుట్టపైకి చేరుకొని పార్వతీ జడల రామలింగేశ్వరుని దర్శించుకోవడంతో తొలి పర్యాయం గిరిప్రదక్షిణను పూర్తిచేశారు. విశ్వహిందూ పరిషత్ కూడా గిరి ప్రదక్షిణపై విస్తృత ప్ర చారం నిర్వహిస్తోంది. గిరిప్రదిక్షణకు భక్తులు రావాలని ఇప్పటికే పలు సోషల్ మీడియా ద్వారా ప్రచారం నిర్వహించారు. ఉదయం 6.15 గంటలకు గిరి ప్రదక్షిణ ప్రారంభం కానుంది.

ఆడపిల్లలను కాపాడుకోవాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆడ శిశువుల విక్రయాలు, బాల్యవివాహాలు, బాలికలపై లైంగికదాడులు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ(వీసీపీసీ) బలోపేతంపై కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ముఖ్యంగా గ్రామీణ స్థాయిలో ప్రజలకు అవగాహన లేకపోవడం వల్ల ఆడపిల్లలను అక్రమంగా దత్తత ఇవ్వడం, బాల్య వివాహాలు చేస్తున్నారన్నారు. విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీల సమావేశాలను ఈ నెల 30లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కరపత్రాలు, పోస్టర్లు, పాటలు, కళారూపాల ద్వారా, ప్రత్యేకించి లంబాడా భాషలో తయారు చేయిస్తున్నామన్నారు. గ్రామ స్థాయి చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీల సమావేశాలు నిర్వహించే గ్రామాల్లో మైకుల ద్వారా ప్రచారం చేయించాలన్నారు. ఈ సమావేశంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, సీడీపీవోలు, డీసీపీవో గణేష్, డీసీపీయూ సిబ్బంది తేజ, విద్య, వెంకన్న, రేవతి, నర్సింహ, అంజలి, ఎల్లేశ్వర్ పాల్గొన్నారు.

చదువుతోనే అన్నీ సాధ్యం

చదువుతోనే అన్నీ సాధ్యమవుతాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహిస్తున్న 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆమె జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. అంతకుముందు దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంతో కష్టపడి ఇందిరాగాంధీ ప్రధాని అయ్యారని, పేద ప్రజల సంక్షేమానికి గరీబీ హఠావో నినాదాన్ని తీసుకువచ్చారన్నారు. ఆమె అనేక భాషల్లో ప్రావీణ్యురాలని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఎం.హఫీజ్ ఖాన్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందిస్తాయన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ ప్రస్తుత భవనం సరిపోనందున కొత్త భవనం మంజూరు చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ బాలమ్మ, ఉద్యోగులు కుసుమశ్రీ, రవి, మల్లేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు సహకారం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు సహకారం అందిస్తానని రోడ్డు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎన్జీ కళాశాలలో ఈ నెల 28 నుంచి డిసెంబరు 12 వరకు కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే ఎన్‌పీఎల్-6 పోస్టర్‌ను మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్‌తో కలిసి మంత్రి బుధవారం సెక్రటేరియట్లో ఆవిష్కరించారు. టోర్నమెంట్‌కు అన్ని విధాలా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ మాట్లాడుతూ టోర్నమెంట్‌లో పాల్గొనే విజేతలకు మొదటి బహుమతి 2,22,222, ద్వితీయ బహుమతిగా 1,11,111 అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ఆంగోతు ప్రదీప్‌నాయక్, కేసాని వేణుగోపాల్‌రెడ్డి, నిర్వాహకులు బోనగిరి ప్రభాకర్, ముత్తినేని నాగేశ్వరరావు, పాలకూరి శ్రీధర్, గంజి గిరి, కోమటిరెడ్డి శేఖర్‌రెడ్డి, సాయి, చిన్ని రంగ, మధు, నవీన్‌రెడ్డి, నాని పాల్గొన్నారు.

సంస్కరణల ఘనత ఇందిరాగాంధీదే

నల్లగొండ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశ అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్నో సంస్కరణలు చేపట్టిన ఘనత మాజీ ప్రధాని ఇందిరాగాంధీకే దక్కుతుందని మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ అన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని బుధవారం పట్టణంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఇందిరాగాంధీ ప్రధానిగా బ్యాంకులను జాతీయకరణ చేసి నిరుపేదలకు బ్యాంకులను అందుబాటులోకి తెచ్చారన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, కేసాని వేణుగోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కత్తుల కోటి, జహంగీర్ బాబా, మామిడి కార్తీక్, గాలి నాగరాజు, జానీ, పాదం అనిల్, కంచర్ల ఆనంద్‌రెడ్డి, పెరిక అంజయ్య, బోడ ప్రభాకర్ పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌గౌడ్

దేశానికి ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి

● ఘనంగా ఇందిరాగాంధీ జయంతి ● దేవరకొండ, మిర్యాలగూడ, సాగర్‌లలో నివాళులర్పించిన ఎమ్మెల్యేలు బాలునాయక్, భాస్కర్‌రావు, జైవీర్‌రెడ్డి

దేవరకొండ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు మరవలేనివని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఇందిరాగాంధీ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేసి మాట్లాడారు. ఇందిరాగాంధీ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు ఎండీ సీరాజ్‌ఖాన్, హన్మంతు వెంకటేష్ గౌడ్, పున్న వెంకటేశ్వర్లు, లోకసాని శ్రీధర్ రెడ్డి, లోకసాని కృష్ణ, నజీర్ అహ్మద్ రాంసింగ్, యునీస్, సైదులు, తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడలో ఇందిరాగాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బీఎల్ఆర్

పాలనా దక్షత కలిగిన ప్రధాని ఇందిరాగాంధీ

మిర్యాలగూడ : గొప్ప పాలనా దక్షత కలిగిన భారత ప్రధానిగా ప్రపంచ దేశాల్లో గుర్తింపు పొందిన నేత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ అని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన చిత్రపటానికి ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌తో కలిసి నివాళులర్పించారు. అనంతరం సాగర్‌రోడ్డులోని ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ గరిబీ హటావో నినాదం ఇచ్చి పేదరికాన్ని నిర్మూలించేందుకు దేశంలో అనేక సంస్కరణలు అములు చేశారన్నారు. రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయకరణ లాంటి నిర్ణయాలతో పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. అలాగే గత ప్రభుత్వంలో నిర్మించి నిర్లక్ష్యంగా వదిలేసిన డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను డిసెంబరు 31 వరకు అర్హులైన పేదలకు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిరుమర్రి కృష్ణయ్య, షైబూబ్‌అలీ, పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇందిరా సంక్షేమమే నేటి పాలనకు స్ఫూర్తి

నాగార్జునసాగర్ : ఇందిరాగాంధీ సంక్షేమ సిద్ధాంతమే నేటి కాంగ్రెస్ ప్రజాపాలనకు స్ఫూర్తిదాయకమని నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. సాగర్ హిల్‌కాలనీలో ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివా ళులర్పించారు. కార్యక్రమంలో హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, పగడాల నాగరాజు రాజా రమేష్ యాదవ్, సురేష్, బాలాజీ నాయక్, జంగయ్య, రామకృష్ణారెడ్డి, ఉంగరాల శ్రీను, అన్నపూర్ణ పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి : మండల కేంద్రంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సిరాజ్‌ఖాన్, కైసర్‌ఖాన్, సురేష్, శంకర్ గౌడ్, నీలం శ్రీనివాస్, బూడిద మల్లేష్ పాల్గొన్నారు.

● చింతపల్లి : స్థానిక పాత బస్టాండ్ సమీపంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంల మాజీ ఎంపీపీ కొండూరి భవానీ పవనకుమార్, కాంగ్రెస్ జిల్లా నాయకులు అంగిరేకుల గోవర్ధన్, పూరె లక్ష్మణ్, మాస భాస్కర్, ఎండీ ఖలీల్ బేగ్, బాణాల దయాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



దేవకొండలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్



సాగర్‌లో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసిన నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

రైతులు నాణ్యమైన ధాన్యం తేవాలి

● కంచర్ల మాధవరెడ్డి, ఏవో, గుర్రంపోడు



రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తెచ్చి మద్ధతు ధర పొందాలని గుర్రంపోడు మండల వ్యవసాయాధికారి కంచర్ల మాధవరెడ్డి సూచించారు. మండలంలో ఎన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు తదితర విషయాలు ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

(ఆంధ్రజ్యోతి-గుర్రంపోడు)

ఆంధ్రజ్యోతి: మం డలంలో ఎన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు?

ఏవో: పీఏసీఎస్ ఆధ్వర్యంలో 3, ఐకేపీ ఆధ్వర్యంలో 4, ఎన్‌డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 8 సెంటర్లు ఏర్పాటు చేశాం.

ఆంధ్రజ్యోతి: ఎన్ని ఎకరాల్లో వరి సాగైంది

ఏవో: సుమారు 16వేల 150 ఎకరాలు సాగు చేశారు.

ఆంధ్రజ్యోతి: ధాన్యం దిగుబడి ఎంత అంచనా వేస్తున్నారు?

ఏవో: 1.90 లక్షల క్వింటాళ్ల వరకు ధాన్యం వచ్చే అవకాశం ఉంది.

ఆంధ్రజ్యోతి: సబ్సిడీపై ఏమైనా అందిస్తున్నారా?

ఏవో: ప్రస్తుతం ఏమిలేవు. వ్యవసాయ యంత్రీకరణ పరికరాలకు దరఖాస్తులు తీసుకున్నాం.

ఆంధ్రజ్యోతి: రైతులకు మీరిచ్చే సూచనలు ఏమిటి?

ఏవో: ధాన్యం చేనుపైనే పూర్తిగా ఆరేలా చూడాలి. దళారీలకు అమ్మకుండా కేంద్రంలో అమ్మితే మద్దతు ధర లబిస్తుంది.

ప్రకృతి వనరులపై అవగాహనఉండాలి

మిర్యాలగూడ టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రకృతి వనరుల గురించి అవగాహన కలిగిఉండాలని ఆదిత్య ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ మారుతి అమరేందర్‌రెడ్డి అన్నారు. ప్రకృతి పరిరక్షణలో భాగంగా విద్యార్థులను వన సందర్శనకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వనరులను గౌరవిస్తూ, కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గౌతమ్ పాఠశాల ప్రిన్సిపాల్ బంటు నాగరాజు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

దేవరకొండ, నవంబరు 19, ఆంధ్రజ్యోతి : ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ లయన్స్ క్లబ్ నిర్వాహకులు మోహన్‌రెడ్డి, డాక్టర్ కృష్ణ కోరారు. బుధవారం దేవరకొండలోని సంజీవని హస్పత్రిలో ఉచితంగా కంటి పరీక్షలు చేసి 8 మందికి ఆపరేషన్ నిర్వహించి మాట్లాడారు. ఉచిత కంటి వైద్య శిబిరాలను దేవరకొండ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ శిబిరంలో డాక్టర్లు అమర్, సదానందం, డాక్టర్ హరి, ఆయుబ్ నందు, మంజుల, పాల్గొన్నారు.

మేమింతే..

(5వ పేజీ తరువాయి)

మల్చుకుంటున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వారు ఆడిందే ఆట పాడిందే పాటగా మారిపోతుంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ల రైటర్లను అనుమతించేందుకు ఎక్కడ కూడా ప్రభుత్వం నుంచి అనుమతి లేదు. ఒక్కో డాక్యుమెంట్ రైటర్ వద్ద నలుగురి నుంచి ఐదుగురి వరకు పనిచేస్తూ వారంతా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తిరుగుతుండటంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. డాక్యుమెంట్ తయారు చేయడంకోసం తప్పనిసరి పరిస్థితుల్లో ఆస్తుల క్రయవిక్రయదారులతో పాటు ప్రతిఒక్కరూ డాక్యుమెంట్ రైటర్‌పై ధారపడాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ చివరకు సబ్ రిజిస్ట్రార్‌తోపాటు ఆయా కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు సైతం డాక్యుమెంటరీ రైటర్‌లపైనే ఆధారపడటం కనిపిస్తుంది.

ఐజీ అనుమతి లేని డిప్యూటేషన్

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో గతంలో పనిచేసిన ఓ ఉన్నతాధికారి తమకు సన్నిహితంగా ఉన్న ఓ ఉద్యోగిని బదిలీ చేసిన 12 గంటల్లోపే తిరిగి డిప్యూటేషన్‌పై జిల్లా కార్యాలయానికి తీసుకరావడం వివాదస్పందంగా మారింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ అనుమతి లేకుండానే సదరు ఉద్యోగిని డిప్యూటేషన్‌పై తీసుకోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. నల్లగొండ జిల్లాలోని ఓ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రెగ్యూలర్ చేసి పంపిన వెంటనే ఆ ఉద్యోగిని అక్కడ రిలీవింగ్ చేయించుకొని మధ్యాహ్నంలోగానే తిరిగి నల్లగొండ ఉమ్మడి నల్లగొండ జిల్లాలోకి తీసుకురావడం గమనార్హం. సదరు ఉద్యోగి వచ్చి రెండేళ్లు కాకముందే సీనియర్లను కాదని అని సెక్షన్‌లను తన గుప్పిట్లో పెట్టుకొని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం సొసైటీల రిజిస్ట్రేషన్ వివాదాలు తనకు చుట్టుకోవడంతో రిలీవ్ చేయమని తానే స్వయంగా ఉన్నతాధికారులను కోరుకున్నట్లు తెలిసింది. అయితే ఆ వివాదం తగ్గగానే మళ్లీ జిల్లా కార్యాలయం నుంచి తనను మార్చకుండా ఉండేందుకు రాజకీయ నేతల నుంచి ఒత్తిళ్లు చేస్తున్నట్లు సమాచారం.

ఒక్కో సొసైటీ నుంచి రూ.1500

కొత్త సొసైటీల ఫైళ్లకోసం ఒక్కో సొసైటీ నుంచి రూ.1000నుంచి రూ.1500, చిట్స్ ఆర్బిటేషన్‌కు సంబంధించి ఒక్కో కేసుకు రూ.3వేల నుంచి రూ.5వేలు వసూలు చేయడం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన తప్పులను సరిదిద్దడానికి (కార్డు) సంబంధించి రూ.1000నుంచి రూ.2000ను ఒక్కో ఫైల్‌కు వసూలు చేస్తున్నట్లు సర్వత్రా చర్చ సాగుతుంది. గత కొన్ని నెలల క్రితం అప్పట్లో ఓ ఇన్‌చార్జి అధికారి సమయంలో సదరు ఈ ఉద్యోగి సూర్యాపేట జిల్లాలోని ఓ నియోజకవర్గానికి చెందిన ఎడ్యుకేషన్ సొసైటీ విషయంలో జోక్యం చేసుకొని ఇరువర్గాల మధ్య గొడవలు పెట్టడమే కాకుండా ఇతర వ్యక్తులనుంచి పెద్ద ఎత్తున ముడుపులు తీసుకున్నట్లు తెలిసింది. కోర్టుల్లో కేసులు ఉన్నా సొసైటీల మధ్య గొడవలు జరిగే విధంగా సదరు అక్రమ డిప్యూటేషన్ ఉద్యోగి వ్యవహరిస్తున్నట్లు వినికిడి. కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలకు సంబంధించి ఆంధ్రజ్యోతి ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ రవీందర్‌రావును వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించినప్పటికీ ఆయన ఫోన్ లిఫ్ట చేయలేదు.

ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలి

● ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి):ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు ఆలస్యం చేయకుండా విడుదల చేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అధికారులను కోరారు. బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆర్డీవో రమాణా రెడ్డితో పాటు, డివిజన్ పరిధిలోని ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పురోగతి, లబ్ధి దారుల సమస్యలను పెండింగ్‌లో ఉన్న బిల్లుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక కారణాలతో నిలిచిన ఇళ్ల సంబంధిత శాఖలతో సమన్వయం పనిచేసి త్వరగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరై వివిధ దశల్లో నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. అనంతరం దేవరకొండ మండలం ముదిగొండ, గుడిలచ్చతండా, ముత్యారాల తండా, జర్పుతండా, వద్యాతండాల్లో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల స్థితి గతులను నిర్మాణ దశను మెటీరియల్ నాణ్యత వివరాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చీమలకుంట తండా నుంచి గుడిలచ్చతండా మీదుగా ముదిగొండ వరకు నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో డానియేల్, ఏపీవో సాగర్‌నాయక్, నిత్యానంద స్వామి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి మద్దతు ధర

అడవిదేవులపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే మద్దతు ధర లభిస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని ఉల్సాయి పాలెం గ్రా మంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రేడ్- ఏ రకానికి క్వింటాకు రూ. 2,389, గ్రేడ్-బీ రకానికి రూ.2,369 మద్దతు ధర తో పాటు క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తున్నందున రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలన్నారు. రైతులు ధాన్యంలో 17శాతం తేమ ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్) : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి అన్నారు. మండలంలోని రాజవరం గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

కార్యక్రమంలో హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, డీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ గడ్డం సాగర్‌రెడ్డి, నాయకులు నెమలి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



తిరుమలగిరి(సాగర్) : రాజవరంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ మాజీ వైస్ చైర్మన్ లింగారెడ్డి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తిరుమలగిరి(సాగర్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హాలియా 132/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో తిరుమలగిరి, రాజవరం 33/11కేవీ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో గురువారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటిరెడ్డి తెలిపారు. గ్రామాల్లో విద్యుత్ లైన్లకు ఆనుకొని ఉన్న చెట్లను తొలగించే పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

అయ్యప్పకు అభిషేకం

చింతపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంకటేశ్వరనగర్ అయ్యప్ప ఆలయంలో భక్తులు కార్తీక మాస చతుర్థి సందర్భంగా అయ్యప్ప స్వామికి అభిషేకం నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయంలో గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, ధర్మశాస్త్రకు వైభవంగా పంచమృతాభిషేక సహిత అష్ట మూలిక అభిషేకం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు యాదయ్య, మల్లోజు జగతయ్య, పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో స్త్రీ శక్తి దివస్

కొండమల్లేపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఏబీవీపీ ఆధ్వర్యంలో మండల కేంద్రం లో స్త్రీ శక్తి దివస్ బుధవారం ని ర్వహించారు. ఈ సందర్భంగా దేవరకొండ నగర గర్ల్స్ కన్వీనర్ బి.సుస్మిత ఆధ్వర్యంలో ఝాన్సీ లక్ష్మీ బాయి చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం ఆమె మా ట్లాడుతూ లక్ష్మీబాయి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యలమల గోపిచంద్, పర్వతం దినేష్, చరణ్, ఐతరాజు కొండల్, అనుష్క, స్పందనపాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయాలి

దేవరకొండ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం దుప్పట్లు పంపిణీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బుడిగ వెంకటేష్ డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దికల్ పహాడ్ ఆదర్శపాఠశాల్లో బుధవారం సంఘం సభ్యత్వ నమోదు ప్రారంభించి మాట్లాడా రు. చలికాలం చలి తీవ్రత ఎక్కువ ఉన్న కారణంగా విద్యార్థులకు దుప్పట్లు సరిగ్గా లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎస్టీ, ఎస్సీ మైనార్టీ కస్తూర్బాగాంధీ వసతి గృహా ల్లో తగిన మౌలిక వసతి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అరుణ్, నవీన్, నరసింహా, అనిల్, అహాషేక్, ప్రణీత, దీపిక తదితరులు పాల్గొన్నారు.



దేవరకొండలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలి

మిర్యాలగూడ టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం అందిపుంచుకోవాలని అప్పుడే ఉద్యోగం సాధించగలరని మీనా మహిళా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ ఎండీ. మహిమూద్ అలీ అన్నారు. కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాలో ఆయన మాట్లాడారు. మారుతున్న విద్యా విధానాలపై అవగాహన పెంచుకోవాలని, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులను పట్టుసాధించంఠ నూతన ఆవిష్కరణలు సాధిం చాలన్నారు. ఆదరణ కలిగిన కోర్సుల్లో పట్టు సాధిస్తే ఉద్యోగావకాశాలు వెతుక్కుంటూ వస్తాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీ మాట్లాడుతూ టెన్ థౌసెండ్ కోడర్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో తమ కళాశాల విద్యార్థినులు 21 మంది ఉద్యోగాలకు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ షహ్లబతూల్, టీపీఓ ఫయాజ్, హెచ్‌వోడీలు మహేష్, పూజ, రవినాయక్, రమేష్, ప్రతాప్, భాస్కర్, యాస్మీన్, వాణి పాల్గొన్నారు.



నియామక పత్రం అందజేస్తున్న కళాశాల చైర్మన్ ఎండీ మహిమూద్

ప్రజా వ్యతిరేక విధానాలను వీడాలి : సీఐటీయూ

మిర్యాలగూడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అన్నారు. స్థానిక ప్రజా సంఘాల నేతలతో కలిసి బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజల జీవనాధారాలపై దాడులు చేస్తున్నాయని అన్నారు. వాటిని తిప్పికోట్టేందుకు కార్మిక, కర్షక ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కేంద్రం లో కార్పొరేట్, మతతత్వ శక్తులతో చేతులు కలిపి రాజ్యాంగాన్ని పరిహాసం చేస్తోందని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 26వ తేదీన జిల్లా కేంద్రాల్లో సీఐటీయూ, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూ సంయుక్తంగా నిర్వహించనున్న నిరసన ప్రదర్శనలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, వివిధ ప్రజా సంఘాల నాయకులు రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, బావాండ్ల పాండు, పాదూరి శశిధర్‌రెడ్డి, తిరుపతి రాం మూర్తి, పాల్వాయి రాంరెడ్డి, కోట శ్రీనివాస్‌రెడ్డి, గోవింద్ రెడ్డి, పిల్లుట్ల సైదులు, పూలమ్మ, సుకన్య, కరి మున్నీసా, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



మిర్యాలగూడలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

ప్రమాదకరంగా మూలమలుపులు

గుర్రంపోడు మండలంలోని కొప్పోలు నుంచి నడికుడకు వెళ్లే రోడ్డు, ఆమలూరు రోడ్డు నుంచి బొల్లారం వెళ్లే దారి మూల మలుపులు, కంపచెట్లతో ప్రమాదకరంగా మారింది. మూలమలుపుల వద్ద ఎలాంటి హెచ్చరికల బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారాయి. కొప్పోలు నుంచి నడికుడకు వెళ్లే దారిలో తరచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ఆటో, బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి చెందగా, పలువురికి గాయాలైన సంఘటనలు ఉన్నాయి. సంబంధిత అధికారులు చెట్లను తొలగించి మూల మలుపుల వద్ద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-గుర్రంపోడు)



ఆమలూరు నుంచి బొల్లారం వెళ్లే దారిలో ప్రమాదకరంగా ఉన్న మూల మలుపు

టీఎస్ యూటీఎఫ్ పట్టణ కార్యవర్గం ఎన్నిక

మిర్యాలగూడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): టీఎస్ యూటీఎఫ్ మిర్యాలగూడ పట్టణ కార్యవర్గాన్ని బుధవారం సంఘం కార్యా లయంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. మిర్యాలగూడ పట్టణ అధ్యక్షుడిగా జడ్పీహెచ్ఎస్ స్కూల్ అసిస్టెంట్ కోడిరెక్క జయరాజు, ప్రధాన కార్యదర్శిగా వాణి విద్యామందిర్ ఎండీ.సాజీద్, ఉపాధ్యక్షుడిగా వి.నాగేందర్, ఎస్కే రజియాబేగం, మహిళా కార్యదర్శి ఎన్.స్వప్న, కోశాధికారిగా లావూరి నెహ్రూ ఎన్నికయ్యారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బక్కా శ్రీనివాసాచారి సమావేశంలో పాల్గొనగా ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర కార్యదర్శి నాగమణి, జిల్లా కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, చిన వెంకన్న, వేదశ్రీలు పాల్గొన్నారు.



జయరాజు, సాజీద్

'బీసీ రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వాలి'

మిర్యాలగూడ టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై స్పష్టత ఇచ్చిన అనంతరమే ప్రభుత్వ స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని బీసీ విద్యార్థి సంఘ జిల్లా అధ్యక్షుడు గాదగోని మహేష్‌గౌడ్ అన్నారు. బుధవారం బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకిచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు పరచాలని, రాజ్యాంగ సవరణ చేయించి రిజర్వేషన్లు అందించాలని డిమాండ్ చేశారు. బీసీల్లో చైతన్యం వచ్చిందని, మరోమారు మోసానికి గురి చేస్తే బీసీల ఆగ్రహానికి గురికావాల్సి ఉంటుందన్నారు. రిజర్వేషన్లు, హక్కుల సాధనకు బీసీలందరూ పార్టీలకు, కులాలకు అతీతంగా ఏకం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నిరంజన్, సురేష్ యాదవ్ కృష్ణ, శరత్, మురళీ పాల్గొన్నారు.

సీపీఐ ప్రచార జాత జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉదయ్ కుమార్

దామరచర్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సీపీఐ ప్రచార జాతా నేడు (గురువారం) మిర్యాలగూడ పట్టణానికి వస్తున్నందున జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్‌కుమార్ పిలుపునిచ్చారు.మండలకేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈనెల 26వ తేదీన ఖమ్మంలో నిర్వహించే భారీ బహిరంగ సభ సందర్భంగా ప్రచార జాత నిర్వహిస్తున్నట్లు. పార్టీ నాటి స్వాతంత్ర్య సంగ్రామం నుంచి పేద బడుగు, బలహీనవర్గాలు, కార్మికులు, కర్షకులు, రైతులు, విదార్థుల పక్షాన పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో ధీరావత్ లింగానాయక్, ధనావత్ శాంత, కోటయ్య, లక్ష్మీనరసింహారెడ్డి, రాములు, చక్రి, సైదులు పాల్గొన్నారు.